Follow: @ANNTELUGU

24-05-2025

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 171 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బీసీలంతా కాంగ్రెస్ వైపు

### కులగణన చారిత్రాత్మక నిర్ణయం

సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చేయాల్సిందే

ఇప్పుడు దేశం చూపు తెలంగాణ వైపు చూస్తోంది

కుట్రదారులు చేసిన తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారు

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

ఆయన పీపీటీని ప్రశంసించిన కాంగ్రెస్ హైకమాండ్ నేతలు

వివరాలు 2లో

**టాప్ న్యూస్**

### కవిత మరో షర్మిల కాబోతోంది


- కవిత లేఖపై ఎంపీ రఘునందన్ రావు



02

### నోటీసులకు భయమెందుకు?

- కాళేశ్వరంతో 62 వేల కోట్లు వృథా
- ఏ తప్పూ చేయకుంటే ఉలుకు ఎందుకు?
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



02

### ఎంపీ డీకే అరుణకు కీలక బాధ్యతలు

- ఎఫ్‌సీఐ కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ ఛైర్‌పర్సన్‌గా నియామకం
- కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ
- రాష్ట్రంలో ఆహార ఉత్పత్తులు, ధాన్యం సేకరణపై కమిటీ అధ్యయనం



02



## మాదిగలకు చాన్స్ ఇవ్వండి!

- మంత్రివర్గ విస్తరణ మరోసారి కదలికలు
- విస్తరణపై పీసీసీ చీఫ్ హింట్ ఇవ్వడంతో పైరవీలు
- తాజాగా సీఎంకు మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు వినతిపత్రం
- రేవంత్‌ను కలిసిన మందుల సామెల్, అడ్లూరి, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలె యాదయ్య, లక్ష్మీకాంతరావు
- మా ఐదుగురిలో ఒకరికి కచ్చితంగా చాన్స్ ఇవ్వాలని లేఖ
- దీనిపై హైకమాండ్‌కు కూడా లేఖలు రాశామన్న నేతలు

వివరాలు 2లో



## మోదీని ఎన్నిసార్లయినా

# కలుస్తా

### రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే వరకు

## నేను నిద్రపోను



రావాల్సిన నిధుల కోసం ఎన్నిసార్లయినా కలుస్తా.. జహీరాబాద్‌ను పరిశ్రమల గేట్‌వేగా అభివృద్ధి చేస్తాం

నిమ్జ్ భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం .. ప్రతిపక్ష నాయకుడికి విజ్ఞప్తి చేస్తున్నా..

శాసనసభకు రండి ప్రజా సమస్యలపై చర్చించి.. తప్పులు చేస్తే మాకు సూచనలివ్వండి..

ప్రజాప్రతినిధులుగా నిత్యం ప్రజలకు అండగా ఉండాలి.. అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తామంటే గుణపాఠం తప్పదు..

గెలిచినా, ఓడినా నేను ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నా.. సీఎం అయ్యాక కూడా ఏనాడు అహంభావం ప్రదర్శించలేదు

చిన్నా పెద్ద తేడా లేకుండా అందరినీ కలుస్తున్నా.. జహీరాబాద్ సభలో సీఎం రేవంత్

**జహీరాబాద్, మహా:** సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో తెలంగాణను ప్రపంచంలోనే ఒక గొప్ప ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ఒక అద్భుతమైన నగరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేసే వరకు నిద్రపోనని, అందుకు అండగా నిలబడాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

మిగతా 2లో

## కేసీఆర్ చుట్టూ దెయ్యాలు

### వారి వల్లే పార్టీకి నష్టం

మా డాడీకి నేను రెగ్యులర్‌గా లేఖలు రాస్తా

నా లేఖతో కాంగ్రెస్, బీజేపీ సంబరపడాల్సిన పనిలేదు

లోపాలు సరిచేసుకుని కేసీఆర్ నాయకత్వంలోనే ముందుకెళ్తాం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు



02

### రూ.200 కోట్ల స్థలం సేఫ్!

- జూబ్లీహిల్స్‌లో హైడ్రా దూకుడు
- రెండెకరాల పార్క్ లాండ్ పరిరక్షణ
- ఆక్రమణదారుల చెర నుంచి విడిపించిన హైడ్రా

02



# మోదీని ఎన్నిసార్లయినా కలుస్తా



(మొదటిపేజీ తరువాయి)

జహీరాబాద్ నిమ్జ్ కోసం భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో నిర్మించిన జహీరాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జిని, మాచనూర్ లో రూ.26 కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని శుక్రవారం సీఎం ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.494.67 కోట్లతో చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గంలోని హుగ్గెల్లి చౌరస్తాలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. మెదక్ జిల్లాతో ఇందిరా గాంధీది విడదీయరాని అనుబంధమని తెలిపారు. ఆమె మెదక్ ఎంపీగా కొనసాగుతుండగానే అమరులవ్వడం బాధకరమని అన్నారు. మెదక్ జిల్లాకు, దివంగత ప్రధాని ఇందిరా గాంధీకి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకుంటూ, 'మెదక్ జిల్లా అంటే ఇందిరమ్మ, ఇందిరమ్మ అంటే మెదక్ జిల్లా' అని, ఇక్కడి ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ మరిచిపోదని అన్నారు. ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, అవసరమైన నిధులను కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు. పటాన్‌చెరు ప్రాంతం ఒక మినీ ఇండియా లాంటిదని, ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలోనే ఈ ప్రాంతంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని సీఎం గుర్తు చేశారు. సింగూరు ప్రాజెక్టును ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. జహీరాబాద్ అభివృద్ధిలో గీతారెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

**రైతు సంక్షేమమే..**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. అభివృద్ధిలో అందరినీ కలుపుకుని ముందుకు వెళతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని నా దృష్టికి తీసుకొచ్చారు. నారాయణఖేడ్ కు సురేష్ షెట్కార్, సంజీవరెడ్డి రెండు కళ్లలాంటివారు. నారాయణఖేడ్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తాం. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రుణమాఫీ చేసి రైతులను రుణవిముక్తులను చేశాం. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచాం. భూమిలేని పేదలకూ భరోసా అందిస్తున్నాం. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. స్వయం సహాయక సంఘాల మహిళలకు బస్సులను అందించి వారిని ప్రోత్సహిస్తున్నాం. ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టాలనే కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. ఆడబిడ్డలకు మాట ఇస్తున్నా.. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం' అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు కంకణం కట్టుకున్నామని అన్నారు. అదానీ, అంబానీలతో పోటీపడి వ్యాపారం చేసేలా మహిళలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రతిపక్ష నాయకుడికి విజ్ఞప్తి..

ఇంటికో ఉద్యోగం అని చెప్పిన ఆయన.. తన ఇంట్లో మాత్రమే ఉద్యోగాలు ఇచ్చుకుని నిరుద్యోగ యువతను మోసం చేశారని మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయం తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ప్రధాని మోదీని ఎన్నిసార్లయినా కలుస్తామని, ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని నొక్కి చెప్పారు. ప్రతిపక్ష నాయకుడికి తాను విజ్ఞప్తి చేస్తున్నా.. శాసనసభకు రండి.. ప్రజా సమస్యలపై చర్చించండంటూ సూచించారు. తాము ఏదైనా తప్పులు చేస్తే సూచనలు ఇవ్వండి సరిదిద్దుకుంటామని చెప్పారు. అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తామని మీరు అనుకుంటే.. ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ప్రజాప్రతినిధులుగా నిత్యం ప్రజలకు అండగా ఉండాలని, గెలిచినా, ఓడినా నేను ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నానని పేర్కొన్నారు. 'ముఖ్యమంత్రి అయ్యాక కూడా నేను ఏనాడు అహంభావం ప్రదర్శించలేదు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరినీ కలుస్తున్నా. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం ఇచ్చే వరకు నేను నిద్రపోయేది లేదు' అని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు.



# మాదిగలకు చాన్స్ ఇవ్వండి!

## మంత్రివర్గ విస్తరణ మరోసారి కదలికలు

- విస్తరణపై పీసీసీ చీఫ్ హింట్ ఇవ్వడంతో పైరవీలు
- తాజాగా సీఎంకు మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు వినతిపత్రం
- రేవంత్‌ను కలిసిన మందుల సామెల్, అడ్లూరి, కవ్వంపల్లి సత్యనారాయణ,వేముల వీరేశం, కాలె యాదయ్య, లక్ష్మీకాంతరావు
- మా ఐదుగురిలో ఒకరికి కచ్చితంగా చాన్స్ ఇవ్వాలని లేఖ
- దీనిపై హైకమాండ్‌కు కూడా లేఖలు రాశామన్న నేతలు

**మహా:** తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ప్రాసెస్ క్లైమాక్స్‌కు చేరుతుంటే ఆశావహులు మరోసారి ముందుకొస్తున్నారు. మా వర్గాలకు కేబినెట్ లో చోటు కల్పించాలని ఎవరి ప్రయత్నాలు వారే చేస్తేన్నారు. ఈ నెలాఖరులో మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హింట్ ఇవ్వడంతో మంత్రి పదవి కోసం పార్టీ పెద్దలను కలిసేందుకు మరింత ప్రయత్నం చేస్తున్నారు. అధిష్టానం వద్దకు పరుగులు పెడుతున్నారు. మంత్రివర్గ విస్తరణ మాట వస్తే మాకంటే మాకే..మంత్రి పదవులు ఇవ్వాలంటూ ఆశావహులు తరుచు తమ గళం వినిపిస్తునే ఉన్నారు. గతంలో ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ప్రేమసాగర్ రావు, వివేక్, బాలునాయక్ వంటి వారు తమకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనంటూ కాస్తా కటువుగానే చెప్పారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలు తమలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానానికి లేఖ రాయగా..ఎస్టీ ఎమ్మెల్యేలు తమకు విస్తరణలో మంత్రి పదవి ఇవ్వాలని లేఖ రాశారు. మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆ వర్గం ఎమ్మెల్యేలు అంతా తమ డిమాండ్‌తో మరో లేఖ రాశారు. ముదిరాజ్‌లకు మంత్రి పదవి ఇవ్వాలని ఆ వర్గం ఎమ్మెల్యేలు సైతం పట్టుబట్టారు.

**మాలలకు డిప్యూటీ సీఎం, స్పీకర్ పదవి ఇచ్చారు..**

తాజాగా మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించాలని ఆ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. మంత్రి రేసులో చాలా మంది ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తుండగా తమ వర్గానికి కేబినెట్‌లో చోటు కల్పించాలని మాదిగ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధిష్టానాన్ని కోరుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలు మందుల సామెల్ (తుంగతుర్తి), కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూరు), వేముల వీరేశం (నకిరేకల్), తోట లక్ష్మీకాంతరావు (జుక్కల్ ), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (ధర్మపురి), కాలె యాదయ్య (చేవెళ్ల) సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎల్పీ హాల్లో ఎమ్మెల్యే మందుల సామేల్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు దామోదర రాజనర్సింహ, కడియం శ్రీహరి మాదిగ ఉపకులమని వివరించారు. మాలలకు డిప్యూటీ సీఎం, స్పీకర్ పదవి ఇచ్చారని, అయినా మాల సామాజికవర్గానికి తాము వ్యతిరేకం కాదన్నారు. మాదిగలకు కూడా మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. అంతకు ముందు మాదిగ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానానికి లేఖ పంపినట్లు తెలిపారు. మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎంకి చెప్పాలని కోరారు. తమ ఐదుగురిలో ఎవరికి ఇచ్చిన పర్వాలేదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించారు.

# బీసీలంతా కాంగ్రెస్ వైపు

## కులగణన చారిత్రాత్మక నిర్ణయం

**సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాం**
**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చేయాల్సిందే**
**ఇప్పుడు దేశం చూపు తెలంగాణ వైపు చూస్తోంది**
**కుట్రదారులు చేసిన తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారు**
**పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
**ఆయన పీపీటీని ప్రశంసించిన కాంగ్రెస్ హైకమాండ్ నేతలు**

**మహా:** కులగణన చారిత్రాత్మకమైన నిర్ణయమని, దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వకారణమని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కుల గణన హామీ కాంగ్రెస్‌ను గెలిపించిందని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీ ఇందిరా భవన్‌లోని ఏఐసీసీ కార్యాలయంలో కుల గణనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ అంశంపై దాదాపు రెండున్నర గంటల పాటు పీపీటీ ఇచ్చిన ఆయన పలు కీలక విషయాలను ప్రస్తావించారు. కులగణన దేశానికి దిక్సూచి, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా కుల గణన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమాజంలో బీసీలు అంతా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కుల గణనపై అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి వర్గం అంతా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని కుల గణనను పూర్తి చేసిందని గుర్తు చేశారు. క్యాబినెట్ లో ఆమోదం, అసెంబ్లీలో బిల్లు చేసి సమగ్రమైన చర్చ చేశామన్నారు. ఈ కులగణన వల్ల రాష్ట్రంలో కులాల వారీగా లెక్కలు తేలాయన్నారు. దాంతో ఏ కులానికి ఎంత రిజర్వేషన్లు ఇవ్వాలనేది రిపోర్టు రూపంలో నిర్ధారణ అయిందని, రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపించామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ హైకమాండ్ నేతలు.. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు బాగుందని, ఇంకా బాగా పనిచేయాలని పేర్కొంటూ అభినందించారని తెలుస్తోంది. విద్యావేత్తలు, మేధావులు, వివిధ సంఘాల ప్రతినిధులతో కులగణన అంశంపై సంప్రదింపులకు ఈ సదస్సు ఏర్పాటు చేయడంపై తెలంగాణ రాష్ట్ర నేతలకు అభినందనలు చెప్పారని పార్టీ వర్గాలు వివరించాయి.







# కవిత మరో షర్మిల కాబోతోంది

## కవిత లేఖపై ఎంపీ రఘునందన్ రావు

**మహా :** కల్వకుంట్ల కవిత లేఖపై బీజేపీ ఎంపీ ఎం. రఘునందన్ రావు స్పందించారు. కవిత లేఖ రాజకీయ పంచాయితీనా? ఆస్తుల పంచాయితీనా? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కవిత మరో షర్మిల కాబోతున్నట్లు కనిపిస్తోందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి కవిత వెళ్లే అవకాశాలు కనపడుతున్నాయన్నారు. కవిత లేఖ డ్రామా వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్లు కనిపిస్తోందని చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో వారసత్వ చిచ్చు నిజమని తెలుస్తోందన్నారు. కవితను బయటకు పంపేందుకే కేటీఆర్, హరీశ్‌రావు ఒకటయ్యారని తెలిపారు. ఎవరు ఏం చేసినా తెలంగాణలో మాత్రం బీజేపీదే అధికారమని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# నోటీసులకు భయమెందుకు?

- కాళేశ్వరంతో 62 వేల కోట్లు వృథా
- ఏ తప్పూ చేయకుంటే ఉలుకు ఎందుకు?: మంత్రి ఉత్తమ్

**మహా:** కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇస్తే బీఆర్ఎస్ నేతలు ఎందుకు వణికిపోతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. తాము ఇంకా చర్యలు తీసుకోలేదని, ప్రస్తుతం విచారణ మాత్రమే జరుగుతున్నదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో భారీగా ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని పేర్కొన్నారు. వైఎస్ హయాంలో తమ్మిడిహట్టి వద్ద 38 వేల కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్ట్ కోసం రూపకల్పన జరిగిందని.. అక్కడ ప్రాజెక్ట్ కడితే ప్రభుత్వానికి చాలా డబ్బు ఆదా అయ్యేదని పేర్కొన్నారు. కానీ కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం అంచనాలు పెంచి లక్ష కోట్లకు తీసుకెళ్లారని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిస్థితి ఏమిటో ఎన్డీఎస్ ఏ తేల్చి చెప్పిందని గుర్తు చేశారు. శుక్రవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రంలో వికృత, వికారమైన విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జ్యుడీషియల్ కమిషన్ విచారణలో భాగంగా కేసీఆర్, హరీష్ కు నోటీసులు పంపిస్తే తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

# కేసీఆర్ చుట్టూ దెయ్యాలు

## వారి వల్లే పార్టీకి నష్టం

మా డాడీకి నేను రెగ్యులర్‌గా లేఖలు రాస్తా
నా లేఖతో కాంగ్రెస్, బీజేపీ సంబరపడాల్సిన పనిలేదు
లోపాలు సరిచేసుకుని కేసీఆర్ నాయకత్వంలోనే ముందుకెళ్తాం
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్:** 'మా నాయకుడు కేసీఆర్ .. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది' అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న ఆమెకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో జాగృతి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. ''వరగంల్ సభ తర్వాత రెండు వారాల క్రితం నా తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు లేఖ రాశా. నా అభిప్రాయాలు లేఖ ద్వారా స్పష్టం చేశా. అంతర్గతంగా రాసిన లేఖ ఎలా బయటికి వచ్చిందో అర్థం కావడం లేదు. దీని వెనుక ఎవరు ఉన్నారో తెలియదు. నా కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుక పూర్తి చేసుకొని అమెరికా నుంచి వచ్చే లోపు లేఖ బహిర్గతం అయింది. దానిపై హంగామా నడుస్తున్నట్టు తెలిసింది. కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయని మొన్ననే చెప్పాను. నేను అంతర్గతంగా కేసీఆర్‌కు రాసిన ఉత్తరం బహిర్గతం కావడంపై పార్టీలో ఉన్న అందరం ఆలోచించుకోవాల్సిన విషయం. పార్టీలో నాయకులు అనుకుంటున్న విషయాలే నేను లేఖలో ప్రస్తావించాను. గతంలోనూ నా తండ్రికి అంతర్గతంగా లేఖలు రాశా. కేసీఆర్ కు మార్తెనైన నేను రాసిన లేఖ లీక్ అయింది. దీన్ని బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నా పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన వారి పరిస్థితేంటి? నా లేఖ లీక్ వెనుక ఎవరో ఉండి ఉండొచ్చు.

**నా తండ్రికి రెగ్యులర్ గా లేఖలు రాస్తా**

కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. వాటి వల్లే పార్టీకి నష్టం. మా నాయకుడు కేసీఆర్ .. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది. కేసీఆర్ నాయకత్వంలోనే భారాస పార్టీ ముందుకెళ్తుంది.కోవర్టులను పక్కకు తప్పిస్తే పార్టీ బాగుపడుతుంది. పార్టీలో చిన్న చిన్న లోపాలను చర్చించుకోవాల్సిన అవసరముంది. నా తండ్రికి నేను రెగ్యులర్‌గా లేఖలు రాస్తా. ఇందులో వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదు. నా లేఖ చూసి కాంగ్రెస్, భాజపా సంబర పడ్సాలిన పనిలేదు'' అని కవిత అన్నారు. ఎల్కతుర్తి సభ తర్వాత పాజిటివ్, నెగిటివ్ ఫీడ్ బ్యాక్ పేరుతో భారాస అధినేత కేసీఆర్‌కు ఇటీవల కవిత రాసిన లేఖ బయటికొచ్చింది. ఈ లేఖ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం కావడంతో ఆమె స్పందించారు.



# రూ. 200 కోట్ల స్థలం సేఫ్!

## జూబ్లీహిల్స్‌లో హైడ్రా దూకుడు


- రెండెకరాల పార్క్ లాండ్ పరిరక్షణ
- ఆక్రమణదారుల చెర నుంచి విడిపించిన హైడ్రా

**మహా:** జూబ్లీహిల్స్‌లో దాదాపు రూ. 200 కోట్లు విలువ చేసే రెండెకరాల పార్క్ స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. కబ్జాదారుడు ఓ ఇంటిని అద్దెకు తీసుకుని దాని చుట్టూ ఉన్న ప్రభుత్వ, ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాల ఆక్రమించగా వాటిని హైడ్రా తొలగించింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 41 పెద్దమ్మ గుడి సమీపంలోని నాలాతో పాటు పార్క్ రహదారిని ఆక్రమించి నిర్మించిన భవనాలను హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. ఓ కబ్జాదారుడు ఇంటిని అద్దెకు తీసుకుని యజామానికి తెలియకుండా చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ ఆస్తులను పార్క్ స్థలాలు ఆక్రమించి దర్జాగా హోటళ్లు, హాస్టల్స్‌కు అద్దెకు ఇచ్చి నెలకు రూ.10 లక్షలు వసూలు చేస్తున్నాడు. దీనిపై యజమాని హైడ్రాకు ఫిర్యాదు చేయగా.. అద్దె వ్యక్తికి నోటీసులు జారీ చేసింది. అతను సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్రమంగా తనకు హక్కులేని స్థలాలను ఆక్రమించి ఏకంగా భవనాలు నిర్మించడంపై మండిపడింది. వెంటనే నాలతో పాటు రోడ్లు, పార్కు స్థలాలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించింది. దీంతో శుక్రవారం రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది బుల్డోజర్లతో విరుచుకుపడి అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. ఆ ప్రదేశంలో జీహెచ్ఎంసీ చక్కటి పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. విలువైన ప్రజోపయోగ స్థలాలను పరిరక్షించిన హైడ్రాకు స్థానికులు జేజేలు పలుకుతున్నారు.

# ఎంపీ డీకే అరుణకు కీలక బాధ్యతలు

## ఎఫ్‌సీఐ కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ ఛైర్‌పర్సన్‌గా నియామకం

**కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ**
**రాష్ట్రంలో ఆహార ఉత్పత్తులు, ధాన్యం సేకరణపై కమిటీ అధ్యయనం**



**మహా :** తెలంగాణకు చెందిన పార్లమెంట్ సభ్యురాలు (ఎంపీ) డీకే అరుణకు కేంద్ర ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు చెందిన కన్సల్టేటివ్ కమిటీకి తెలంగాణ రాష్ట్ర ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకం ద్వారా రాష్ట్రంలోని ఆహార ధాన్యాల సేకరణ, సంబంధిత అంశాలపై డీకే అరుణ ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ కమిటీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఆహార ఉత్పత్తుల లభ్యత, ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లపై లోతైన అధ్యయనం చేయనుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి, తగిన సిఫార్సులను ప్రభుత్వానికి అందించడంలో ఈ కమిటీ చురుకైన పాత్ర పోషించనుంది. రాష్ట్ర రైతాంగం, వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కమిటీ తన విధులను నిర్వర్తిస్తుంది. తనకు ఈ నూతన బాధ్యతలు అప్పగించినందుకు డీకే అరుణ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# మీ పోస్టులు అర్థం కాలేదనుకున్నారా?

## సజ్జల భార్గవరెడ్డిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం


**మహా :** వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులకు సంబంధించిన కేసుల్లో ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. అరెస్ట్ నుంచి 2 వారాల పాటు మధ్యంతర ఉపశమనం కల్పించింది. ఆలోపు ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా సజ్జల భార్గవ రెడ్డిపై జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో ఆయన పెట్టిన పోస్టుల పైనా తీవ్ర అభ్యంతరం తెలిపింది. ''సోషల్ మీడియాలో మీరు పెట్టిన పోస్టులు మాకు అర్థం కాలేదనుకున్నారా? ఏ ఆలోచనతో పోస్టులు పెట్టారో ఆ మాత్రం తెలుసుకోలేమా? ఆ పోస్టులు భరించరాని స్థాయికి వెళ్లాయి. తప్పు ఎవరు చేసినా తప్పే. ఇలాంటి వాటిని వ్యవస్థ క్షమించదు.. తప్పక శిక్షిస్తుంది. సోషల్ మీడియా దుర్వినియోగం కేసుల్లో త్వరగా బెయిల్ వస్తుందనుకోవద్దు. అలా బెయిల్ వస్తే ప్రతి ఒక్కరూ ఇష్టారీతిన వ్యవహరిస్తారు'' అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.



# సమష్టిగా ముందుకెళ్దాం

## రెండు రాష్ట్రాల రైతులకు మేలు చేస్తాం

**ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉండాలి**
**ఎగుమతుల ప్రోత్సాహంతో రైతులకు నష్టం లేకుండా చూస్తాం**
**ఏపీ, తెలంగాణ సివిల్ సప్లై మంత్రులు నాదెండ్ల మనోహర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**హైదరాబాద్‌లో తెలుగు రాష్ట్రాల పౌరసరఫరాలశాఖ మంత్రుల భేటీ**
**రాష్ట్ర విభజన తరువాత ఏర్పడిన పౌరసరఫరాల విభజన, పరస్పర సహకార అంశాలపై డిస్కషన్**
**సివిల్ సప్లై భవనం తెలంగాణకు అప్పగిస్తాం: మంత్రి మనోహర్**



**హైదరాబాద్: మహా:** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారంతో పౌర సరఫరాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పౌర సరఫరాల శాఖ మంత్రులు నాదెండ్ల మనోహర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల పౌర సరఫరాల శాఖ మంత్రుల సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఎర్రమంజిల్‌లోని ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్ భవనంలో జరిగిన ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ పౌర సరఫరాల శాఖల మంత్రులు నాదెండ్ల మనోహర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరురాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత ఏర్పడిన పౌర సరఫరాల విభజన, పరస్పర సహకార అంశాలపై చర్చలు జరగాయి. విభజన ఒప్పందం ప్రకారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ భవనం ఏపీఎస్సీఎస్సీఎల్‌కు కేటాయించబడింది. ప్రస్తుతం ఈ భవనంలోని 2వ, 3వ, 4వ, 5వ అంతస్తులను తెలంగాణ సివిల్ సప్లై కార్పొరేషన్ అద్దెకు తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించగా, ఈ అద్దె ఒప్పందంపై ఇరుపార్టీల మధ్య ఎంవోయూపై సంతకాలు జరిగాయి. నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలోనే ఉమ్మడి ఏపీలో తెలంగాణ బిల్లు పాస్ అయిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆ క్రెడిట్ అప్పటి స్పీకర్‌గా నాదెండ్లకు ఇవ్వాలన్నారు. ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇరు రాష్ట్రాల విధానాలు, బెటర్ టెక్నాలజీ గురించి చర్చించినట్లు తెలిపారు. కాకినాడ పోర్ట్ నుంచి ఎక్స్ పోర్ట్ చేస్తున్నామని.. ఇల్లీగల్ రైస్ కట్టడి గురించి మాట్లాడినట్లు చెప్పారు. అసెట్స్ ట్రాన్స్‌ఫర్ గురించి మాట్లాడుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర విభజనలో సివిల్ సప్లై సగం బిల్డింగ్ ఏపీకి వెళ్ళిందని.. రెసిడెంట్స్ ప్లాట్ 16 పంజాగుట్టలో ఉన్నాయి. తెలంగాణకే రాబోతున్నాయని స్పష్టం చేశారు. తెలంగాణ సివిల్ సప్లై ఆఫీస్ బిల్డింగ్ ఇరుగ్గా ఉందని.. బయట మీటింగ్‌లు పెట్టాల్సి వస్తోందన్నారు. ఫుడ్ రిలేటెడ్ డిపార్ట్‌మెంట్ లు ఇక్కడే ఉండాలని ఈ ఏపీ బిల్డింగ్ అడిగినట్లు తెలిపారు. జూన్ 1 నుంచి పూర్తి బిల్డింగ్ మనకు అప్పగిస్తున్నారని స్పష్టం చేశారు. సివిల్ సప్లై ఆస్తులపై చర్చలు జరిగాయని, కార్పొరేషన్‌కు ఉన్న ఆస్తుల బదిలీ మీద మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. అనంతరం ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. "ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉండాలని, ఎవ్వరూ సమస్యలు ఎదుర్కోవద్దని.. ప్రజలకు మేలు చెయ్యాలని మా ఉద్దేశం. వీలైనంత త్వరగా మంచి వాతావరణంలో కలిసి ముందుకు వెళ్లాలని నిర్ణయం. 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఏపీ సివిల్ సప్లై భవన్‌ను పూర్తిగా తెలంగాణకు అప్పగిస్తున్నాం. తెలంగాణలో అమల్లో ఉన్న టెక్నాలజి మార్పులను మేము అందుకుంటాం. తెలంగాణలో కొన్ని అద్భుతమైన సంస్కరణలు చేశారు. కాకినాడ నుంచి పిలిప్పిన్‌కు బియ్యం ఎగుమతి చేస్తున్నాం.. దానికి అవసరమైన అన్ని సౌకర్యాల మీద చర్చించాం. ఆస్తుల బదిలీ జరగాల్సిన అవసరం ఉంది. రైతాంగానికి మేలు జరిగేలా ఆహార భద్రతలో లోపాలు లేకుండా చెయ్యాలని ఉద్దేశ్యం. జూన్ 12 నుంచి పాఠశాలల్లో సన్న బియ్యం అందించనున్నాం. ఎక్స్ పోర్ట్ మీద కూడా చర్చించాం... వినియోగదారులకు మేలు రకమైన బియ్యం అందుబాటు ధరలో ఉండాలనేది మా ఉద్దేశ్యం." అని ఏపీ మంత్రి వ్యాఖ్యానించారు.

# తెలంగాణను ప్రశంసలతో ముంచెత్తిన మిస్ వరల్డ్ కాంటెస్టెంట్లు

**మహిళల భద్రత, సాధికారతకు ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ**
**తెలంగాణ అభివృద్ధి, ఆత్మీయత, ఆత్మగౌరవానికి ప్రతీక**
**అంతర్జాతీయ అందాల కిరీటధారులు**




**మహా :** 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన "హెడ్‌టుహెడ్ చాలెంజ్" ఫినాలే సందర్భంగా, వివిధ ఖండాల నుంచి వచ్చిన అందాల కిరీటధారులు తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యంగా హైదరాబాద్‌ను అభినందనలతో ముంచెత్తారు. ఈ పోటీ సందర్భంగా జడ్జీలు అడిగిన ప్రశ్నలకు తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి, మహిళల సాధికారత, భద్రతకు సంబంధించి contestants చేసిన వ్యాఖ్యలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి.

**మహిళల భద్రతపై అభినందనలు**

తెలంగాణ రాష్ట్రం మహిళల భద్రతను హక్కుగా గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటుందన్న విషయాన్ని పలువురు స్పష్టం చేశారు. భద్రత అనేది ఒక హక్కు, దానిని అందించడంలో తెలంగాణ ముమ్ముందు ఉందన్నారు. హైదరాబాద్ నగర వీధుల్లో మహిళలు రాత్రి పూట కూడా భయపడకుండా స్వేచ్ఛగా తిరగగలగడం ఆశ్చర్యాన్ని కలిగించిందని చెప్పారు. ఇది ఒక సురక్షిత నగరానికి ప్రతీక అని అభివర్ణించారు. పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ షీ టీమ్స్, హాక్ ఐ, 24x7 పర్యవేక్షణ వంటి సాంకేతిక భద్రతా వ్యవస్థలను పరిశీలించి మహిళల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి విశేషంగా అక్కర్శించయని అన్నారు.

**తెలంగాణను ప్రపంచానికి ఎలా పరిచయం చేస్తారు?**

తెలంగాణ సాంకేతికత, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందడమే కాకుండా, మహిళల హక్కులు, విద్య, సాధికారతకు కూడా అత్యున్నత ప్రాధాన్యతనిచ్చే రాష్ట్రంగా పలువురు వివరించారు. ఇది ప్రపంచానికి శక్తివంతమైన సందేశాన్ని అందిస్తున్నదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మీయత, ఆదరణ, ఆతిథ్య భావం ప్రత్యేకంగా నిలిచిందని అన్నారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు స్పూర్తిదాయకంగా అనిపించాయని, 'బ్యూటీ విత్ పర్పస్' భావన ఇక్కడ జీవనశైలిలో కనిపించిందని చెప్పారు. తెలంగాణ అనుబంధాల తాటిపై నిలిచిన భూమి, స్నేహబంధాలకు నిలయం, సంస్కృతికి ప్రతీకగా భావిస్తున్నామని చెప్పారు. 72వ మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ల కళ్లలో తెలంగాణ ఒక అభివృద్ధి చెందిన, మహిళలకు భద్రత కలిగిన, ఆత్మీయత నిండిన ప్రగతిశీల రాష్ట్రంగా నిలిచింది. వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు తెలంగాణ కీర్తి, అతిధ్య, పురోగతిని అంతర్జాతీయంగా తెలియజేస్తున్నడంలో సందేహం లేదు.



**మత్తు మందు ఇచ్చి ఎంబీబీఎస్**
## విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

- మహారాష్ట్రలోని సాంగ్లీలో ఘటన
- బాధితురాలి ఇద్దరు క్లాస్‌మేట్స్‌తో పాటు మరో స్నేహితుడి అరెస్ట్

**మహా :** మహారాష్ట్రలోని సాంగ్లీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వైద్య విద్య అభ్యసిస్తున్న 22 ఏళ్ల యువతిపై ఆమె ఇద్దరు క్లాస్‌మేట్స్, వారి మరో స్నేహితుడు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలికి కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసుకు సంబంధించి విశ్రామ్‌బాగ్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. కర్ణాటకలోని బెళగావికి చెందిన 22 ఏళ్ల యువతి, సాంగ్లీలోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. మే 18వ తేదీ, ఆదివారం రాత్రి ఈ దారుణం జరిగినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. నిందితుల్లో ఇద్దరు ఆమె క్లాస్‌మేట్స్ కాగా (ఒకరు పుణె, మరొకరు సోలాపూర్‌కు చెందినవారు), మూడో వ్యక్తి వారి స్నేహితుడు (సాంగ్లీకి చెందినవాడు). నిందితుల వయసు 20 నుంచి 22 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో, సినిమాకు వెళ్లే ముందు కాసేపు తమ అపార్ట్‌మెంట్‌లో ఉందామని చెప్పి నిందితుల్లో ఒకరు బాధితురాలిని వాన్లెస్‌వాడిలోని తమ అద్దె ఫ్లాట్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడ నిందితులు ముగ్గురూ మద్యం సేవించి, బాధితురాలికి మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చారని ఆమె ఆరోపించారు. అది తాగిన కొద్దిసేపటికే తనకు కళ్లు తిరుగుతున్నట్లు అనిపించిందని, ఆ తర్వాత ముగ్గురూ తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు పోలీసులకు వివరించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలుంటాయని నిందితులు తనను బెదిరించినట్లు కూడా ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. భయంతో రెండు రోజులు మౌనంగా ఉన్న బాధితురాలు, చివరకు ధైర్యం కూడగట్టుకుని మంగళవారం రాత్రి తన తల్లిదండ్రులకు జరిగిన దారుణాన్ని వివరించింది. అనంతరం, తల్లిదండ్రుల సహాయంతో విశ్రామ్‌బాగ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# సైనికులకు రాజకీయాలంటగట్టొద్దు

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**మహా :** సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ గురించి గతంలో కేసీఆర్, కవితలు అవాకులు, చవాకులు మాట్లాడరని, ప్రస్తుతం ఆపరేషన్ సిందూర్ గురించి ఎన్ని విమానాలు కోల్పోయారని రాహుల్ గాంధీ ప్రశ్నిస్తూ దేశ సైనికశక్తి స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రధాని మోదీనో, తమనో విమర్శిస్తున్నారనుకుంటే వారి నీచ రాజకీయాలు సైనికులకు ఆపాదించేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని హిమాయత్ నగర్ భగ్గీఖాన్ బస్తీలో నిర్మిస్తున్న అదనపు కమ్యూనిటీ హాల్ పనులను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై బస్తీవాసులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ అనేక అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ ద్వారా నిధులు అందడం లేదని ఆరోపించారు. ఈ రెండింటికి సీఎం రేవంత్ రెడ్డి కావాల్సిన నిధులను మంజూరు చేసి అభివృద్ధి పనులను వేగిరం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్ల పనుల్లో జాప్యం నెలకొందన్నారు. కనీసం వీధి లైట్లను మార్చలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని చెప్పారు. ఎన్నోమార్లు అధికారులతో మాట్లాడినా వీధి లైట్లను ఎందుకు మార్చలేకపోతున్నారని నిలదీశారు. ఆయా చోట్ల అభివృద్ధి పనులను చేస్తున్న కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదన్నారు. దీంతో అభివృద్ధి పనుల్లో జాప్యం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను ఆయా సంస్థలకు వెంటనే మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్క కార్పొరేటర్ కు కూడా నిధులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని ఆరోపించారు. అందాల పోటీలు నిర్వహిస్తున్నారే తప్ప బస్తీలలో పేరుకుపోయిన సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని నిలదీశారు.



# కవిత లేఖ...

## కాంగ్రెస్ వదిలిన బాణం

**కేంద్ర మంత్రి బండి సంజయ్**

**మహా :** ఎమ్మెల్సీ కవిత పేరుతో ఉన్న లేఖ కాంగ్రెస్ వదిలిన బాణమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన ట్విట్టర్ వేదికగా శుక్రవారం స్పందించారు. కాంగ్రెస్ వదిలిన బాణం అనే శీర్షికతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. డాడీకి రాసిన లేఖ ఒక ఓటీటీ ఫ్యామిలీ డ్రామాగా మారవచ్చునని ఆయన వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. తెలంగాణను విఫలం చేశాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో వారంత కలిసి బీజేపీని నిందిస్తున్నారని చెప్పారు. కుటుంబ పాలనను తమ పార్టీ నిత్యం వ్యతిరేకిస్తునే ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అది గాంధీ ఫ్యామిలీ అయినా.. కల్వకుంట్ల ఫ్యామిలీ అయినా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కుటుంబ పార్టీలు వారి వ్యక్తిగత సంక్షోభాలను ప్రజా భావోద్వేగంగా మార్చడానికి ప్రయత్నిస్తాయన్నారు. ప్రజలను బీజేపీ జైలుకు పంపదన్నారు. చట్టం మాత్రమే పంపుతుందని చెప్పారు. ఎవరైనా దోషి అయితే.. వారిని ఏదీ రక్షించ లేదన్నారు. కానీ ఈ అంశాన్ని తెలంగాణ చూస్తుందని.. ఆ క్రమంలో ఈ డ్రామాను తీవ్రంగా పరిగణించడం లేదని తెలిపారు. ప్రతీ సర్వేలో భారతీయ జనతా పార్టీ గ్రాఫ్ పెరుగుతుందన్నారు. శబ్దం లేకుండా, అధికారం లేకుండా, కేవలం ప్రజల నమ్మకంతోనే తమ పార్టీ ప్రజల్లో అంతర్లీన ప్రవాహంగా వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు నిజమైన మార్పుతోపాటు అభివృద్ధిని సైతం కోరుకుంటున్నారని తెలిపారు. రాజకీయం.. కుటుంబ డ్రామా కాదన్నారు. ఆ మార్పు బీజేపీతోనే అవుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు

**కవిత రాసినట్లు చెబుతున్న లేఖ**
## ఒక పెద్ద జోక్

- అదంతా కల్వకుంట్ల కుటుంబం ఆడుతున్న డ్రామా
- బీఆర్ఎస్‌లో ఎలాంటి చీలికలు లేవు
- కుటుంబంలో గొడవ వస్తే అది ఆస్తుల కోసమే
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**మహా :** బీఆర్ఎస్ పార్టీకి ఏమాత్రం భవిష్యత్తు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత రాశారంటూ ప్రచారంలో ఉన్న లేఖపై స్పందిస్తూ, అదొక పెద్ద జోక్ అని ఆయన కొట్టి పారేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కవిత రాసినట్లుగా చెబుతున్న లేఖ గురించి కోమటిరెడ్డి మాట్లాడుతూ, "మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ అయిన వ్యక్తి రాసే లేఖకు ఒక పద్ధతి అంటూ ఉంటుందా? ఆ లేఖను మేమే సృష్టించాల్సిన అవసరం ఏముంది?" అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో ఎలాంటి చీలికలు లేవని, ఇదంతా ఒక నాటకమని ఆయన అభిప్రాయపడ్డారు. బయటకు వచ్చిన లేఖ కూడా ఈ డ్రామాలో భాగమేనని ఆయన అన్నారు. "తండ్రికి లేఖ రాయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఏమైనా ఉంటే నేరుగా చెప్పొచ్చు కదా" అని ఆయన వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు వస్తున్నాయంటే ఎవరూ నమ్మరని కోమటిరెడ్డి పేర్కొన్నారు. "వారు అంత తేలిగ్గా గొడవపడరు. ఒకవేళ వారి మధ్య ఏదైనా వివాదం తలెత్తితే, అది కేవలం ఆస్తుల పంపకాలకు సంబంధించి మాత్రమే అవుతుంది" అని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తుపై తనకు ఎలాంటి ఆశలు లేవని ఆయన తేల్చిచెప్పారు.

# నేడు ఢిల్లీలో నీతి ఆయోగ్ మీటింగ్

**హాజరుకానున్న ముఖ్యమంత్రి.. సీఎం హోదాలో తొలిసారి సమావేశానికి**

**మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరగనున్న నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. 2018 తర్వాత ఈ సమావేశానికి హాజరవుతున్న తొలి తెలంగాణ సీఎం ఆయనే కావడం విశేషం. ఆ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' పేరిట ప్రత్యేక నివేదికను సమర్పించనున్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న అభివృద్ధి ప్రణాళికలు, సుపరిపాలన విధానాలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కేంద్రం నుండి కావలసిన సహకారం వంటి అంశాలు ఉంటాయి. 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని సాధించేందుకు తెలంగాణ చేపడుతున్న మార్గాన్ని కూడా వివరించనున్నారు. రాష్ట్ర ఐటీ, ఫార్మా, అర్బనైజేషన్ రంగాల్లో ఎలా పురోగమిస్తోంది, వాటిని మరింత వేగంగా అభివృద్ధి చేయడానికి తీసుకుంటున్న చర్యలపై చర్చిస్తారు.

# పాక్‌లో పట్టపగలే ఉగ్రవాదుల కార్యకలాపాలు కొనసాగుతాయి

- ఐరాస ఉగ్ర జాబితాలోని వారు పాకిస్థాన్‌లోనే ఉన్నారు
- పాక్ ఆర్మీకి ఉగ్రవాదంతో సంబంధాలున్నాయి
- విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్



**మహా :** పాకిస్థాన్ గడ్డపై ఉగ్రవాదులు పగటిపూట సైతం తమ కార్యకలాపాలను నిరాటంకంగా కొనసాగిస్తున్నారని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రంగా విమర్శించారు. నెదర్లాండ్స్‌కు చెందిన మీడియా సంస్థలకు ఇచ్చిన వరుస ఇంటర్వ్యూలలో ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాద కార్యకలాపాల గురించి తమకు తెలియదని పాకిస్థాన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. పాకిస్థాన్ ప్రభుత్వం, ఆ దేశ సైన్యం రెండూ ఉగ్రవాద కార్యకలాపాల్లో పూర్తిగా నిమగ్నమై ఉన్నాయని ఆయన ఆరోపించారు. "ఐక్య రాజ్యసమితి ఆంక్షల జాబితాలో ఉన్న కరడుగట్టిన ఉగ్రవాదులంతా పాకిస్థాన్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు. ఆ దేశంలోని పెద్ద నగరాల్లోనే వారు పగటిపూట కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వారు ఎక్కడ ఉంటారో, ఎలాంటి చర్యలకు పాల్పడుతున్నారో, వారి మధ్య సంబంధాలు ఏమిటో అన్నీ మాకు తెలుసు" అని జైశంకర్ గట్టిగా వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ, "ఈ ఘటనలో తమ ప్రమేయం లేదని పాకిస్థాన్ నటించకూడదు. పాక్ ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలకు అన్ని విధాలా సహకారం అందిస్తోంది. ముఖ్యంగా పాక్ సైన్యం సరిహద్దు ఉగ్రవాదంలో పూర్తిగా కూరుకుపోయింది" అని ఆయన ధ్వజమెత్తారు. ఉగ్రవాదం, కశ్మీర్ అంశాలను భారత్ వేర్వేరుగా పరిగణిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఓఎస్డీ పేరుతో బెదిరింపులు

## మాజీ క్రికెటర్ అరెస్ట్

**ఏపీ, తెలంగాణలో పలు కేసులు**
**పలు కేసుల్లో అరెస్టు వారంట్ లు**



**మహా :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్డీని అంటూ బెదిరింపులకు పాల్పడుతోన్న ఆంధ్రాకు చెందిన బుడుమూరు నాగరాజును పోలీసులు అరెస్ట్ చేశారు. బుడుమూరు నాగరాజు ర్యాపిడో, కంట్రీ డిలైట్ సంస్థల ఎండీలకు ఫోన్ చేసి సీఎం ఓఎస్డీనంటూ బెదిరించి డబ్బులు డిమాండ్ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బుడుమూరు నాగరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాగరాజు తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓఎస్డీనని చెప్తూ పలువురు రియల్ ఎస్టేట్ కంపెనీల ఛైర్మన్‌లకు మెసేజ్ పెట్టినట్లు తెలిసింది. అలాగే ఫేక్ ఈ మెయిల్ క్రియేట్ చేసినట్టు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. శ్రీకాకుళంలో నాగరాజును అరెస్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు.. రిమాండ్‌కు తరలించారు. బుడుమూరు నాగరాజుపై గతంలోనూ కేసులు నమోదయ్యాయి. 2023లో శ్రీకాకుళంలో గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. 29 క్రిమినల్ కేసులలో నాగరాజు వాంటెడ్‌గా ఉన్నట్లు తెలిసింది. ఇందులో తెలంగాణలో 13 కేసులు, ఏపీలో 16 కేసులు ఉన్నాయి. 2020లో హైదరాబాద్ సైబర్ క్రైమ్ కేసులో బుడమూరు నాగరాజుపై నాన్ బెయిలబుల్ కేసు పెండింగ్‌లో ఉంది. అలాగే సీఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే కారణంగా గతేడాది డిసెంబర్‌లోనూ విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు. 2019లో బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్కే ప్రసాద్ పేరుతో మోసం చేస్తున్నాడనే కారణంతో విజయవాడ పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. విశాఖపట్నంలో క్రికెట్ అకాడమీ పెడుతున్నానంటూ ఎంఎస్కే ప్రసాద్ పేరుతో వ్యాపారవేత్తల నుంచి డబ్బులు వసూలు చేశారనే కారణంతో అరెస్ట్ చేశారు.


**రంజీ క్రికెటర్.. చీటర్‌గా ఎలా మారాడు..?**

శ్రీకాకుళం జిల్లా పొలాకి మండలం యవ్వారిపేటకు చెందిన 32 ఏళ్ల బుడమూరు నాగరాజు తాను గతంలో ఆంధ్రా తరుపున రంజీ మ్యాచ్‌లు ఆడినట్లు చెప్పుకుంటూ ఉంటారు. తాను ఎంబీఏ గ్రాడ్యుయేట్ అని, మాజీ రంజీ ఆటగాడినని చెప్పుకుంటారు. అయితే, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నాగరాజు వాదనలను తోసిపుచ్చుతోంది. 2023 మేలో ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌కు సన్నిహితుడినంటూ మోసం చేసినందుకు ముంబయి సైబర్ క్రైమ్ పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. 2021లో కేటీఆర్ వ్యక్తిగత కార్యదర్శిగా నటించి తొమ్మిది కార్పొరేట్ సంస్థలను రూ.40 లక్షలకు మోసం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. 2018 నుంచి అతను ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు చెప్తున్నారు. అయితే తాను ఇలాంటి మోసాలకు పాల్పడటానికి ప్రతీకారమే కారణమని బుడమూరు నాగరాజు చెప్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక రాజకీయ నాయకుడు తనను రూ. 15 లక్షలకు మోసం చేసారని.. దాంతో తన క్రికెట్ కెరీర్ నాశనమైందనేది నాగరాజు వాదన. అప్పటి నుంచి దానికి ప్రతీకారంగా ఈ పనులు చేస్తున్నట్లు అతను అంగీకరించాడని కొన్ని వార్తా కథనాలు పేర్కొన్నాయి. అలాగే 2016లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కోసం నాగరాజు ప్రయత్నించినట్లు కొన్ని కథనాలు చెప్తున్నాయి. సుదీర్ఘంగా క్రికెట్ నెట్ సెషన్‌లో పాల్గొని ప్రపంచ రికార్డు నమోదు చేసే ప్రయత్నం చేసినట్లు కొన్ని వార్తా కథనాలు పేర్కొంటున్నాయి.

# కోటాలోనే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు?

## సుప్రీంకోర్టు సూటి ప్రశ్న

- రాజస్థాన్ ప్రభుత్వ వైఖరిపై జస్టిస్ పర్దీవాలా తీవ్ర అసంతృప్తి
- ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థి మృతి కేసులో ఎఫ్ఐఆర్ ఆలస్యంపై ఆగ్రహం



**మహా :** రాజస్థాన్‌లోని కోచింగ్ హబ్ అయిన కోటా నగరంలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకర రీతిలో పెరిగిపోతుండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పరిస్థితిని 'తీవ్రమైనది'గా అభివర్ణించింది. ఈ ఏడాది కోటాలో ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడటం పరిస్థితి తీవ్రతను సూచిస్తోందని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల ధర్మాసనం శుక్రవారం ఈ అంశాన్ని విచారించింది. "ఒక రాష్ట్రంగా మీరేం చేస్తున్నారు? కేవలం కోటాలోనే ఈ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు? దీని గురించి రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించలేదా?" అంటూ జస్టిస్ పర్దీవాలా రాజస్థాన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది, ఆత్మహత్యల ఘటనలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే, విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి జాతీయ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని మార్చి 24న ఇచ్చిన తీర్పును ధర్మాసనం గుర్తుచేసింది. సిట్ నివేదికకు సమయం పడుతుందని, ఆలోగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండరాదని హితవు పలికింది. ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రెండు కేసులను పరిశీలించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థి మృతి కేసులో ఎఫ్ఐఆర్ నమోదులో నాలుగు రోజుల జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. "ఇలాంటి విషయాలను తేలిగ్గా తీసుకోవద్దు. సంబంధిత పోలీస్ అధికారిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకునేవాళ్లం" అని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఎఫ్ఐఆర్ నమోదై దర్యాప్తు జరుగుతుండటంతో, దర్యాప్తు వేగంగా, సరైన దిశలో సాగాలని సూచించింది. కోటాలో నీట్ ఆశావహ విద్యార్థిని ఆత్మహత్య కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీరు మా తీర్పును ధిక్కరిస్తున్నారు. ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు?" అని ప్రభుత్వాన్ని నిలదీసింది. విద్యార్థిని తల్లిదండ్రులతో ఉన్నా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయడం పోలీసుల విధి అని, ఈ విషయంలో సంబంధిత పోలీస్ అధికారి విఫలమయ్యారని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వైఫల్యంపై వివరణకు, జూలై 14న తమ ముందు హాజరుకావాలని కోటాకు చెందిన సంబంధిత పోలీసు అధికారిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిర్లక్ష్యాన్ని వీడి, విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు తక్షణ పటిష్ట చర్యలు చేపట్టాలని, బాధ్యులైన అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం రాజస్థాన్ ప్రభుత్వానికి కఠిన ఆదేశాలిచ్చింది.



మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ | 19-05-2025

Special Story

# అంతఃపుర రాజకీయాలు

## భారత రాజకీయాల్లో కుటుంబ పవర్ పంచాయతీలు

(మహా ప్రత్యేకం)

భారతదేశంలో రాజకీయ కుటుంబాల్లో అనేక సందర్భాల్లో కలహాలు చెలరేగాయి. అంతఃపుర రాజకీయాలు పవర్ పాలిటిక్స్ లో షరామామూలయ్యాయి. ప్రాంతీయపార్టీల్లో.. ప్రాంతీయ పార్టీలు ఏలిన రాష్ట్రాల్లో వారసత్వ పోటీలు, పవర్ కోసం ఆధిపత్య పోరాటాలు కామన్ గా మారాయి. తెలుగునాట ఇపుడు రెండు రాష్ట్రాల్లోనూ పవర్ పంచాయతీలున్నాయి. తాజాగా కల్వకుంట్ల కవిత లేవనెత్తిన అంశాలు కుటుంబపార్టీలో తుఫాన్ హెచ్చరికకకు సంకేతంగా నిలుస్తున్నది.



### కవిత మరో షర్మిల?

జగన్ తో చెల్లి షర్మిలకు విభేదాలు వచ్చాయి. పార్టీ కోసం వాడేసుకుని.. గెలిచాక పక్కనపెట్టేశారంటూ చెల్లి మండిపడింది. ఆస్తులు సరిగ్గా పంచకుండా తనకు అన్యాయం చేశారంటూ అన్నతో గొడవ పెట్టుకుంది. వైఎస్సార్ తెలంగాణ పార్టీ అంటూ వేరు కుంపటి పెట్టుకుంది. కొంతకాలం బాగానే ట్రై చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో కలిపేశారు. ఏపీ పీసీసీ చీఫ్ అయ్యారు. కవిత ఎపిసోడ్ సైతం షర్మిల స్టోరీతో సరిపోలుతోందని విశ్లేషిస్తున్నారు. కల్వకుంట్ల కుటుంబంలో సైతం కుంపటి రాజుకుందని అంటున్నారు. జైలు నుంచి వచ్చాక కవిత పార్టీకి దూరంగా ఉంటున్నారు. పార్టీయే ఆమెను దూరం పెట్టిందనే టాక్ కూడా ఉంది. జాగృతి జెండా కిందనే యాక్టివ్ పాలిటిక్స్ చేస్తున్నారు కవిత. బీసీ నినాదం ఎత్తుకున్నారు. పూలే విగ్రహం కోసం పట్టుబడుతున్నారు. సామాజిక తెలంగాణ రావాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇవన్నీ బీఆర్ఎస్‌కు ఇబ్బంది కలిగించే స్ట్రాటజీలే అంటున్నారు. చెల్లి ఎత్తుగడలు పసిగట్టిన కేటీఆర్.. ఇటీవల బావ హరీశ్‌రావుతో వరుస మీటింగ్‌లు జరిపారని అంటున్నారు. కవిత పార్టీని వీడితే సరే.. లేదంటే వాళ్లే వెళ్లగొట్టేలా ఉన్నారని ప్రచారం జరిగింది. అందుకే, ఇటీవల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలు జైల్లో ఉండొచ్చా.. ఇంకా తనను కష్టపెడతారా? తనపై కుట్ర చేస్తుంది ఎవరో తెలుసు.. రెచ్చగొడితే మరింత రెచ్చిపోతా.. అంటూ ఇన్‌డైరెక్ట్‌గా కేటీఆర్ టార్గెట్‌గా హాట్ కామెంట్స్ చేశారని అంటున్నారు.

### దేశంలోని రాజకీయ కుటుంబాలు.. వైరుధ్యాలు ఇలా

#### 1. ఆంధ్ర ప్రదేశ్

**వైఎస్ కుటుంబం**

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి (వైసీపీ అధినేత) vs
వైఎస్ వివేకానంద రెడ్డి కుటుంబం
వైఎస్ జగన్ మోహన్ రెడ్డి vs వైఎస్ షర్మిల
ఒకే రక్తం పంచుకున్న అన్నా చెల్లెల నడుమ ఆస్తిపంచాయతీలు..
చివరికి సంఘర్షణకు దారితీసి, రాజకీయ బాటలను వేరుపరిచాయి.

**ఎన్టీఆర్ కుటుంబం**

ఎన్టీఆర్ vs చంద్రబాబు నాయుడు
చంద్రబాబు vs లక్ష్మీపార్వతి
నందమూరి హరికృష్ణ వర్గం, బాలకృష్ణ వర్గం మధ్య ఆంతర్యం
కాలక్రమంలో చంద్రబాబు రాజకీయ చాణక్యంతో నిలదొక్కుకోగా,
కొందరు రాజీపడ్డారు.

#### 2. తెలంగాణ

**కేసీఆర్ కుటుంబం**

కేసీఆర్ తనయుడు కేటీఆర్, తన కుమార్తె కవిత –
వారసత్వ రాజకీయాలపై విమర్శలు.. కేసీఆర్ కు కవిత తాజా లేఖ
వారసత్వ హక్కుపై పార్టీ లోపల అసంతృప్తిని బయటపెట్టింది.. కేటీఆర్,
హరీష్, కవితల మధ్య పవర్ ఫైట్.. ఉందన్నది పార్టీ వర్గాల అంచన

#### 3. తమిళనాడు

**కలైంజర్ కరుణానిధి కుటుంబం**

స్టాలిన్ vs అళగిరి
కరుణానిధి మరణం తర్వాత వారసత్వానికి సంబంధించి తీవ్ర
స్థాయిలో కలహాలు.. స్టాలిన్ డిఎంకె అధినేతగా వ్యవహరిస్తుండగా,
అళగిరి బహిష్కరణకు గురయ్యాడు

#### 4. మహారాష్ట్ర

**శివసేన – ఠాక్రే కుటుంబం**

ఉద్ధవ్ ఠాక్రే vs ఏక్‌నాథ్ షిండే వర్గం
శివసేన పార్టీకి చీలిక, ఎన్నికల గుర్తు షిండేపరం
ఎన్‌సిపి – పవార్ కుటుంబం.. శరద్ పవార్ vs అజిత్ పవార్
పార్టీ విభజన, అజిత్ పవార్ బీజేపీకి మద్దతుతో డిప్యూటీ సీఎంగా
కొనసాగుతున్నాడు

#### 5. ఉత్తరప్రదేశ్

**ములాయం సింగ్ యాదవ్ కుటుంబం**

(సమాజవాదీ పార్టీ)
అఖిలేశ్ యాదవ్ vs శివపాల్ యాదవ్
పార్టీ నియంత్రణ కోసం తీవ్ర సంచలనం, చివరకు అఖిలేశ్ ఆధిపత్యం

#### 6. పంజాబ్

**బాదల్ కుటుంబం (శిరోమణి అకాలీదళ్)**


సుఖబీర్ సింగ్ బాదల్ వారసత్వానికి వ్యతిరేకంగా పార్టీకి లోపల
అసంతృప్తి.. కుటుంబ ఆధిపత్యం కారణంగా పలువురు సీనియర్
నేతలు పార్టీ వీడి వెళ్లారు

#### 7. బీహార్

**లాలూ ప్రసాద్ కుటుంబం (ఆర్జేడీ)**

తేజస్వీ యాదవ్ కీలక నేతగా ఎదుగుతుండగా, తేజ్ ప్రతాప్ యాదవ్
విభేదాలు కలిగించాడు. కుటుంబంలో మిగిలిన సభ్యులతో కూడా
స్వల్ప విభేదాలు. రాజకీయ కుటుంబాలలో కనిపించే అంతర్గత
కలహాలు: వారసత్వ రాజకీయాలపై పోటీ.. నాయకత్వంపై క్లాష్..
పార్టీపై నియంత్రణ కోసం పోరాటం.. వెన్నుపోట్లు







# కళ్యాణ వేడుకల్లో కంది శ్రీనన్న


**ఆదిలాబాద్, మహా :** పెళ్లిళ్ల సీజన్ లో కళ్యాణ వేదికలన్నీ కళకళలాడుతున్నాయి. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పై అభిమానంతో తనను ఆహ్వానించిన వారి వివాహాది శుభకార్యాలకు ఆయన తన శ్రేణులతో కలిసి హాజరయ్యారు. కళ్యాణ మండపాలలో మిత్రులు, శ్రేయోభిలాషులు అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. పట్టణంలోని పలు ఫంక్షన్ హాళ్ల లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులు ఆశీర్వదించి కంది శ్రీనన్న పెళ్లి కానుకలను బహుకరించారు.

# ఉర్దూ జర్నలిస్ట్ కు ఆత్మీయ సత్కారం



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కు చెందిన ప్రముఖ ఉర్దూ జర్నలిస్ట్ షాహిద్ అహ్మద్ తవక్కల్ తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ లో ఉత్తమ ఉర్దూ జర్నలిస్ట్ గా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలో శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షులు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆయనను అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు.ఉర్దూ భాషాభివృద్ధికి షాహిద్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, ముజాహిదీన్ ,మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ జహీర్ రంజానీ, ఎంఏ షకీల్,దేరా కృష్ణారెడ్డి, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, మేయర్



**హన్మకొండ మహా;** బల్దియా పరిధి 9, 4 వ డివిజన్ లలోని సుధానగర్, యాదవ నగర్, లోటస్ కాలనీ, ప్రాంతాల్లో కార్పొరేషన్ జనరల్ నిధులు రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సి సి రోడ్లు డ్రైన్ నిర్మాణ పనులకు శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చీకటి శారద ఆనంద్, బొంగు అశోక్ యాదవ్, ఈ ఈ రవి కుమార్, డి ఈ రాజ్ కుమార్, ఏ ఈ హరికుమార్, మాజీ కార్పొరేటర్లు విద్యాసాగర్, బోడ డిన్న, స్థానిక నాయకులు, తదితరులు, పాల్గొన్నారు

# మొక్కలు నాటి పర్యవేక్షించేలా ఎస్ హెచ్జీలకు బాధ్యతలు

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు నగర మేయర్ గుండు సుధారాణి**

**అమృత్ మిత్ర 2.0 లో భాగంగా నగర పరిధి లో మూడు చెరువుల్లో అమలు...**




**వరంగల్ మహా;** మొక్కలు నాటి పర్యవేక్షించేలా మహిళా సంఘాలకు (ఎస్ హెచ్ జీ)బాధ్యతలు అప్పగించనున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. శుక్రవారం వర్ధన్నపేట నియోజక వర్గ పరిధి లోని బట్టుపల్లి కోట చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నగర మేయర్ కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ ఎమ్మెల్యే లు మాట్లాడుతూ అమృత్ మిత్ర 2.0 లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నగరంలోని మూడు చెరువులను మొక్కలు నాటి సంరక్షించే విధం గా ఎంపిక చేసిన నేపధ్యంలో విమెన్ ఫర్ ట్రీస్"(చెట్ల కొరకు మహిళలు)లో భాగం గా చెరువును సందర్శించడం జరిగిందని నగరం లో చిన్న వడ్డేపల్లి చెరువు, రంగ సముద్రం చెరువు,బట్టుపల్లి కోట చెరువులను ఎంపిక చేశారని ఒక్కో చెరువు పరిధి లో వెయ్యి మొక్కల చొప్పున మొత్తం 3 వేల మొక్కలను స్వయం సహాయక బృంద మహిళలు నాటి సంరక్షించాల్సి ఉంటుందని ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 న మొక్కలను నాటి సంవత్సర కాలం పాటు సంరక్షిస్తారని ఇందుకోసం ఎంపిక చేసిన మూడు ఎస్ హెచ్ జీ బృందాలకు కేంద్ర ప్రభుత్వం నెల వారిగా ఆర్థిక సహకారం అందిస్తుందని మొక్కల సంరక్షణలో మహిళలను భాగస్వాములను చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఓ లు రమేష్, లక్ష్మారెడ్డి, టి ఎం సి రమేష్, హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రియాంక, ఎస్ హెచ్ జీ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# గో సంరక్షణ చర్యలపై హైదరాబాద్ సిటీ పోలీసుల చర్యలు బేష్

**ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబర్ కేటాయింపు: 8712661155**



**రంగారెడ్డి ప్రతినిధి మహా:** బక్రీద్‌కు ముందు గో సంరక్షణ చర్యలపై తక్షణ చర్య తీసుకున్నందుకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, హైదరాబాద్ సిటీ ప్రత్యేక పోలీస్ అధికారి విక్రమ్ సింగ్ మాన్ ను న్యాయవాదులు చల్లా రామ్ కళ్యాణ్, మేకల శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ స్వప్న మాలి పటేల్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బి ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది చల్లా రామ్ కళ్యాణ్, ప్రాజెక్ట్ హెడ్, పావ్టెక్షన్ అడ్వకేట్ మేకల శ్రీనివాస్ యాదవ్, డైరెక్టర్ డాక్టర్ స్వప్న మాలి పటేల్ త్వరలో రానున్న బక్రీద్ పండుగకు ముందు ప్రత్యేక బృందాల ఏర్పాటుకు సంబంధించి తమ విజ్ఞప్తికి తక్షణమే సానుకూలంగా స్పందించిన కో సంరక్షణ చట్టాన్ని అమలు చేయడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. తెలంగాణలో గో సంరక్షణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్ర పోలీసు సిబ్బంది, విశ్వసనీయ ఎన్‌జీఓలతో కూడిన అంకితమైన గో సంరక్షణ దళం ఆవశ్యకతను విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. వెంటనే స్పందించిన ప్రత్యేక అధికారి విక్రమ్ సింగ్ మన్ ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబర్ కేటాయింపు 8712661155 ఏర్పాటు చేశారు. గో సంరక్షణ చట్టంపై అవగాహన కల్పించడంతోపాటు సమన్వయం చేయడానికి ఏసీపీ ర్యాంక్ అధికారిని నియమించడంతో నగర సిపి చర్యలను వారు ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు బలగాలతో కలిసి పనిచేయడానికి ధృవీకరించబడిన గో రక్షక బృందాలకు అధికారిక ఐడి కార్డులు జారి చేయడం జరిగిందన్నారు. ఈ సకాలంలో జోక్యం పండుగ సమయంలో జంతు హక్కులను పరిరక్షించడానికి, మత సామరస్యాన్ని కొనసాగించడానికి కీలకమైన అడుగు పడిందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. గో సంరక్షణ చర్యలకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉందని వారు విజ్ఞప్తి చేశారు. గోసంరక్షణలో భాగమైనటువంటి బి ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ అన్ని అంశాలను www.bthechange.in వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని వెల్లడించారు.


# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



**హన్మకొండ మహా;** జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచే విధంగా బడిబాట కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రానున్న విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచే విధంగా చేపట్టనున్న బడిబాట కార్యక్రమం పై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమ నిర్వహణకు ప్రణాళిక అవసరమని, తహసిల్దార్, ఎంపీడీవోలు, ఎంఈఓ లు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.. బడిబాట కార్యక్రమాల నిర్వహణతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగే విధంగా కృషి చేయాలన్నారు.

# అనుమానాస్పద స్థితిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళపల్లి ఎక్స్ రోడ్ వద్ద, సుప్రియ బాయ్స్ హాస్టల్ రెండవ అంతస్తు ఓ గదిలో ఉంటున్న, భారత్ ఇంజనీరింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోలే నాగిరెడ్డి(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న ఏసీబీ కెపివి రాజు, సిఐ ఐ జగదీష్. హాస్టల్ గదిలో ఇద్దరు ఉంటున్నట్టు పోలీసులు వెల్లడించారు. వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది. పూర్తి వివరాలు తెలియాల్సింది ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. పోలే నాగిరెడ్డి, జంగమహేశ్వర గ్రామం, గురజాల మండలం, గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు వెల్లడించారు.

# వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయండి

**సిడిఎంఏ డాక్టర్ టి కే శ్రీదేవి**

**మున్సిపల్ కమిషనర్లు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**వరంగల్ మహా;** వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని సిడిఎంఏ డా.టికే శ్రీదేవి అన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్త మున్సిపల్ కమిషనర్లు అధికారులతో వందరోజుల ప్రణాళిక అమలు తీరుపై హైదరాబాదు నుండి ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ లో సిడిఎంఏ పాల్గొని సమర్థవంతంగా అమలు పరచుటకు తన సూచనలు చేశారు. నగరం తరపు నుండి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిఎంఏ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అమలు చేయనున్న వంద రకాల సేవలు ప్రజలకు చేరువ చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్లలో బ్రాండ్ అంబాసిడర్ల ద్వారా సూచించిన కార్యక్రమాల పై విస్తృత ప్రచారాన్ని కల్పించాలని, స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా తడి పొడి చెత్తను వేరుగా అందించేలా చూడడం, అమృత్ మిత్ర పథకంలో భాగంగా మెప్మా సిబ్బంది పార్కులతో పాటు జంక్షన్ ను గుర్తించడం, భువన్ ద్వారా నమోదు చేసిన ప్రాపర్టీస్ ను తనిఖీ చేయడం, ఎకో ఫ్రెండ్లీ సేవలు అందించడం, వాల్ పెయింటింగ్స్ , సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వ పథకాలకు విస్తృతంగా ప్రచారం కల్పించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నియంత్రించడం , ఎన్జీవోలు మెప్మా అధికారులు సమన్వయంతో సూచించిన వంద రోజుల కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని సిడిఎంఏ సూచించారు.

# ఎరువుల విక్రయాలు ఈ-పాస్ మెషిన్ల ద్వారానే చేపట్టాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, మహా;** ఎరువుల విక్రయాలను ఈపాస్ మెషిన్ల ద్వారానే చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శుక్రవారం వరంగల్ శివనగర్ లోని సాయి కన్వెన్షన్ లో వరంగల్ జిల్లాలోని రిటైల్ ఎరువుల వ్యాపారులకు కొత్త L1 ఈపాస్ మెషిన్ల కంపెనీ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిధిగా పాల్గొని డీలర్లకు ఈపాస్ మెషిన్ ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డీలర్లు అందరూ తప్పనిసరిగా ఎరువుల విక్రయాలను ఈపాస్ మెషిన్ ద్వారా మాత్రమే చేపట్టాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఈపాస్ మిషన్ల స్థానంలో కొత్త L1 ఈపాస్ మెషిన్లను పంపిణీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎరువుల శాఖ వారు మరియు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు ఈరోజు 171 ఈపాస్ మెషిన్లను కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ వారు డీలర్లకు ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యంగా రైతులకు ఎరువుల పంపిణీ పారదర్శకంగా సాగేందుకు, ప్రభుత్వ నిబంధనల మేరకు ఆధునిక సాంకేతికత వినియోగమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈపాస్ మెషిన్లతో ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా సాగుతుందని. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో, సరైన రేట్లకు అందుబాటులోకి వస్తాయని అన్నారు. డీలర్లు నిబంధనల ప్రకారం మెషిన్ల ను ఉపయోగించి సరఫరా జరపాలని సూచించారు. ఈపాస్ మెషిన్లతో ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు.

# రెడ్ క్రాస్ సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్, భవన నిర్మాణానికి శంకుస్థాపన**

**పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు**



**హన్మకొండ మహా;** రెడ్ క్రాస్ సొసైటీ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న బ్లడ్ స్టోరేజ్ సెంటర్ నూతన భవనానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్, రెడ్ క్రాస్ సొసైటీ బిల్డింగ్ నిర్మాణ పనులను ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే, కలెక్టర్.. మాట్లాడుతూ ప్రతి జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర గవర్నర్ సూచించారని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు జిల్లాలలో రెండు జిల్లాలు హనుమకొండ, వరంగల్ లలో రెడ్ క్రాస్ సొసైటీలు ఉన్నాయని అన్నారు. అదేవిధంగా భూపాలపల్లి, జనగామ జిల్లాలలో కూడా వీటిని ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. థలసేమియా బాధితులకు ఎప్పటికప్పుడు రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. థలసేమియా భారీన పడిన చిన్నారులకు అప్పుడప్పుడు రక్తం లభించకపోవడంతో హైదరాబాద్ కు వెళ్తుంటారని పేర్కొన్నారు. అట్లాంటి వారందరికీ రెడ్ క్రాస్ ద్వారా సేవలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెడ్ క్రాస్ సేవలు మరింతగా విస్తరించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ కి ప్రజాప్రతినిధులుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రెండు రోజుల క్రితం ఇక్కడ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డిజబులిటీ సెంటర్ తో పాటు థలసేమియా సెంటర్ను ఏర్పాటు చేయాలని తనకు వినతి పత్రాన్ని అందించారని పేర్కొన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నందున ఢిల్లీ కి వచ్చినట్లయితే హెల్త్ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి వాటి ఏర్పాటుకు కృషి చేద్దాం అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ కొత్త తరహా సేవలను కృషి చేయాలని, ఇందులో భాగంగా మేనుస్ట్రువల్ హైజిన్ తో పాటు కౌమార దశ బాలికలకు రక్తహీనత ఏర్పడుతుంది కాబట్టి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ పెరగడానికి ఐరన్ మాత్రలను అందించాలన్నారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలని సూచించారు. చిన్నచిన్న కేంద్రాలలో ముందుగా ఈ సేవలను ప్రారంభించాలన్నారు. ఇలాంటివి చేపట్టినట్లయితే రెడ్ క్రాస్ సేవలు పెరిగినట్లు అవుతాయని అన్నారు. డ్రగ్స్ మహమ్మారి పట్ల అవగాహన కల్పించాలని కోరారు. డి అడిక్షన్ సెంటర్ ను ప్రారంభించాలని కోరుతున్నట్లు తెలిపారు.

# నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇండ్ల పథకం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్లు మున్సిపాలిటీ పదవ వార్డు పరిధిలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ చేయడం జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు సంబంధిత మంజూరు పత్రాలు అందజేశారు. నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ఉంటుందని, ఆర్థిక స్థోమత లేని నిరుపేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి, రాష్ట్రంలో ఇండ్లు లేని నిరుపేదల అందరూ ప్రజా ప్రభుత్వంలో నమోదు చేసుకున్న అర్హులందరికీ దశలవారీగా వారి సొంతింటి కలను నేరవేర్చుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షులు సురేష్ నాయక్, రవి, పర్వతాలు, వెంకటేశ్వరరెడ్డి, మల్లేష్, బాలు, మురళీ, దావీద్ లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జనంలోకి తీసుకెళ్లండి

## రాహుల్ గాంధీ ఆలోచనలపై పబ్లిసిటీ చేయాలి

బీజేపీ పాలనకు చరమగీతం పాడుదాం

కాంగ్రెస్ విధి విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించండి

రాహుల్ చేపట్టిన 'వైట్ టీ షర్ట్' ఉద్యమం చాలా గొప్పది: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం.. ఎడ్యుకేషన్ ఎక్స్ పో 2025 ప్రారంభించిన మంత్రి



**మహా:** దేశంలో బీజేపీ సాగిస్తున్న నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు రాహుల్ గాంధీ ఆలోచనలు, కాంగ్రెస్ విధి విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని యువజన కాంగ్రెస్ నాయకులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసర బాల వికాస కేంద్రంలో నిర్వహించిన 'వైట్ టీ షర్ట్' శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం యువజన కాంగ్రెస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వైట్ టీ షర్ట్' ఉద్యమం చాలా గొప్పదన్నారు. కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం, అందరికీ పురోగతి లాంటి ఐదు మార్గదర్శకాలకు 'వైట్ టీ షర్ట్' చిహ్నంగా నిలుస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి యువజన యువజన కాంగ్రెస్ వెన్నెముక అన్నారు. దేశ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా యువజన కాంగ్రెస్ అవతరించిందన్నారు. ఆ స్ఫూర్తితో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి తెచ్చేందుకు, రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి శ్రవణ్ రావు, నాయకులు నితీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**విద్య, వైద్యంపై స్పెషల్ ఫోకస్..**

అనంతరం హెచ్ఐసీసీలో శుక్రవారం ఎడ్యుకేషన్ ఎక్స్ పో 2025ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించి మాట్లాడారు. అందరికీ నాణ్యమైన విద్యను అందించడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని, దాన్ని తిరిగి గాడిలో పెట్టి అందరికి నాణ్యమైన విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి అప్పుడూ.. ఇప్పుడూ కాంగ్రెస్ పార్టీ మాత్రమే కృషి చేసిందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా సర్కార్ బడులను తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు.

# అక్రమంగా ఏర్పాటు చేసిన మదర్సాను వెంటనే తొలగించాలి

రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి

మదర్సాను తొలగించకుంటే హిందువులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిక



**బాలాపూర్ మహా:** బడంగ్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని సుల్తాన్ పూర్ గ్రామం లో అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సా నుండి స్థానికంగా ఉన్నటువంటి హిందువులు గత కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో బడంగ్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజెపి అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణా రెడ్డి నీ కాలనీ వాసులు ఆశ్రయించగా ఈరోజు రామకృష్ణా రెడ్డి మదర్సా వద్దకు చేరుకొని అక్కడ స్థానికంగా నివసిస్తున్న హిందువుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సాను వెంటనే తొలగించిలని డిమాండ్ చేశారు.ఇక్కడ హిందువులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుండి విముక్తుని కలిగించాలని లేనియెడల స్థానిక హిందువులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నవారు శ్రీనివాస్ రెడ్డి,మోతిలాల్ నాయక్,క్యారగారి అరవింద్,ప్రవీణ్ గౌడ్, కిరణ్ రాజ్,సుల్తాన్ పూర్ గ్రామస్తులు, వివిధ కాలనీవాసులు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# టిబి రోగస్తులు భయపడాల్సిన అవసరం లేదు

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో టీబి రోగులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

టిబి అలర్ట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కిట్లు అందజేత



**షాద్ నగర్, మహా:** పూర్వం క్షయ (టీబి) వ్యాధి అంటే కచ్చితంగా చనిపోతామన్న భయం ఉండేదని, కానీ ఇప్పుడు టీబి పేషెంట్లకు ఎలాంటి భయం అవసరం లేదని మంచి పౌష్టికాహారం తీసుకుని మందులు వాడితే క్షయ వ్యాధి తగ్గిపోతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో టీబి అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్లను ఎమ్మెల్యే శంకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమం షాద్ నగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి సారద్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. టిబి వ్యాధిగ్రస్తులకు తెలంగాణ ప్రభుత్వం మంచి ఖరీదైన మందులను ఉచితంగా అందజేయడంతో పాటు ప్రతి రోగికి ప్రతి నెల పోషకాహారం కోసం ప్రతి పేషంట్ యొక్క అకౌంట్లో వెయ్యి రూపాయలు జమ చేస్తుందని అన్నారు. క్రమం తప్పకుండా మందులు తీసుకున్నట్టయితే వారి ఆరోగ్యాలు మెరుగుపడతాయని అన్నారు. టీవీ అలర్ట్ ఆఫ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అందజేస్తున్న ఈ కిట్లను పేషెంట్లు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. సంస్థ పంపిణీ చేస్తున్న న్యూట్రిషన్ కిట్లలో మూడు కిలోల గోధుమపిండి మూడు కిలోల బియ్యం ఒక కిలో కందిపప్పు ఒక కిలో పల్లీలు మరియు అరకిలో బెల్లం ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. క్షయ వ్యాధి లక్షణాలను డాక్టర్ విజయలక్ష్మి వివరిస్తూ.. రెండు వారాలకు మించి దగ్గు జ్వరము మరియు రాత్రి పూట చెమటలు పట్టడం బరువు తగ్గడం చాతిలో నొప్పి ఉన్నట్లయితే వారికి క్షయ వ్యాధి ఉండవచ్చని అన్నారు.



# మాకే ఇంకా క్లారిటీ లేదు

## కవిత లెటర్ ఒరిజినలా? ఫేకా తెల్వదు

కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌ను టార్గెట్ చేశాయి

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హాట్ కామెంట్స్

**మహా:** గులాబీ దళపతి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖపై ఆ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. వరంగల్ వేదికగా నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో బీజేపీపై కేసీఆర్ పరిమితంగా మాట్లాడటంతో భవిష్యత్తులో ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటారన్న ఊహాగానాలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవిత లేఖలో పేర్కొన్నారు. సభ విజయవంతమైనందుకు కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ లేఖ రాసిన కవిత.. పాజిటివ్, నెగిటివ్ ఫీడ్‌బ్యాక్ పేరిట 8 అంశాలను ప్రస్తావించారు. ఈ లేఖపై శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కవిత లేఖపై తమకు ఇంకా క్లారిటీ రాలేదని వివరించారు. కాంగ్రెస్‌లో ఆ పార్టీ నేతలు రోజూ కొట్టుకుంటున్నారని, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపైనా క్లారిటీ లేదు.. కానీ రోజూ బీఆర్ఎస్ మీద పడి ఏడుస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు కావాలనే.. బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ చాలా బలమైన పార్టీ అని.. కాంగ్రెస్, బీజేపీలు బలం ఏంటో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు.

# యూటీ పనుల్లో స్పీడ్ పెంచండి

## యుద్ధ ప్రాతిపదికన పాలేరు సాగర్ టన్నెల్ పనులు

సరిగ్గా జూలై 23 నాటికి పనులు కంప్లీట్ చేయాలి

రూ.14.2 కోట్లతో యూటీ కాలువ మరమ్మతులు

రైతులకు సాగునీరు అందించేందుకు సిద్ధం చేయాలి

ఇరిగేషన్ అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు



**ఖమ్మం, మహా:** సాగు నీటి విడుదలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులు పూర్తి చేయాలని, పాలేరులో నాగార్జునసాగర్ ఎడమ కాలువపై చేపట్టిన యూటీ (అండర్ టన్నెల్) నిర్మాణ పనులు వేగంగా చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా పాలేరులో పర్యటించి, జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే పాలేరులోని నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ అండర్ టన్నెల్ (యూటీ) పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వచ్చే జూలై 10వ తేదీనాటికి పూర్తిచేసి వానాకాలం సీజన్‌కు రైతాంగానికి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. శుక్రవారం ఆయన కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో జరుగుతున్న పాలేరు సాగర్ కాలువ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**1.33 లక్షల ఎకరాలకు సాగునీరు..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు సెప్టెంబర్‌లో పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం జుజ్జులరావుపేట సమీపంలో పాలేరు రిజర్వాయర్ దగ్గర ప్రధాన కాలువపై అండర్ టన్నెల్ (యూటీ) కొట్టుకపోయిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. రైతులకు ఇబ్బంది కలగకూడదన్న ఆలోచనతో అప్పట్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసి సాగునీటిని అందించారు. శాశ్వత ప్రాతిపదికన రూ 14.20 కోట్లతో ఈ యూటీ కాలువ మరమ్మతులను ప్రారంభించామన్నారు. ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగానికి జీవనాధారమైన ఈ కాలువ మరమ్మతులను పూర్తిచేసి సాగునీరు అందిస్తామని చెప్పారు. దీనివల్ల ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఒక్క పాలేరు నియోజకవర్గంలో 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అత్యంత ప్రాధాన్యతా క్రమంలో అవసరమైతే రోజుకు రెండు షిఫ్ట్‌ల క్రమంలో పనిచేసి గడువులోగా నిర్మాణపనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 'రైతులకు సాగునీరు అందించేందుకు పనులు పూర్తి త్వరగా పూర్తి చేయాలి. సరిగ్గా జూలై 23 నాటికి యూటీ (అండర్ టన్నెల్) పనులు కంప్లీట్ చేయాలి. వచ్చేది వర్షాకాలం కాబట్టి పనులను ఎట్టి పరిస్థితుల్లో ఆపకుండా యుద్ధ ప్రాతిపదికన రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లాలోని రైతులకు సాగునీరు అందించాలి.' అని మంత్రి పొంగులేటి అన్నారు. అనంతరం పాలేరు గ్రామంలో 37 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా అందులో ఆరుగురికి మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈఈ పద్మజ, పలువురు అధికారులు పాల్గొన్నారు.




# నక్సల్ బరిలో షాద్ నగర్ యువతి

## పోలీస్ ఎన్ కౌంటర్ కన్నుమూసిన విజయలక్ష్మి అలియాస్ భూమిక

12 ఏళ్లుగా అజ్ఞాతంలోనే.. ఉద్యమాలకు ఆకర్షితురాలై వెళ్లి మృత్యువు ఒడిలోకి..

సొంతూరు కేశంపేట మండలం వేములనర్వ

**షాద్ నగర్, మహా:** ఉన్నత చదువులకు హైదరాబాద్ వెళ్లిన యువతి అక్కడి నుంచే అన్నల ఉద్యమబాట పట్టింది. పన్నెండు ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉండి ఛత్తీస్గడ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో కన్నుమూసింది. ఆమె రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన వన్నాడ విజయలక్ష్మి అలియాస్ భూమిక. గ్రామంలోని వన్నాడ సాయిలు గౌడ్ మొదటి భార్య రాధమ్మకు ముగ్గురు అడపిల్లలు. విజయలక్ష్మి మూడో సంతానం. విజయలక్ష్మి పుట్టిన ఏడాదికి పాము కాటుకు గురై రాధమ్మ మృతి చెందింది. విజయలక్ష్మి కేశంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. అనంతరం అక్కడే ప్రైవేట్ పాఠశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. డిగ్రీ మహబూబ్ నగర్లోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ కళాశాలలో చదివింది. అనంతరం నిజాం కళాశాలలో ఎల్ఎల్ బి చేస్తున్న సమయంలో ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై ఉద్యమబాట పట్టిం ది. అప్పటి నుంచి కుటుంబ బంధాలను తెంచుకుంది. ఉద్యమంలోకి వెళ్లిన తర్వాత విజయలక్ష్మితో ఎప్పుడూ మాట్లాడలేదని, గ్రామంలోకి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. చదువుకుంటున్న సమయంలో గ్రామంలో చిన్నపిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెప్పినట్టు గ్రామస్తులు తెలిపారు. విజయలక్ష్మి పన్నెండేళ్ల క్రితం గ్రామాన్ని వదిలి తిరిగి రాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఎక్కడో చత్తీస్గడ్ రాష్ట్రంలో జరిగిన ఆపరేషన్ కగార్ లో మృత్యుపాలైయిందని తెలిసి గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు.

# అసోంలో దారుణం

## పెద్దపులిపై ప్రతీకారం.. 1000 మంది కలిసి చంపేశారు

మనిషిని చంపిందన్న కోపంతో పులిని చంపేసిన గ్రామస్థులు

పులి కాళ్లు, చెవులు, చర్మం, దంతాలు కోసుకెళ్లిన జనం

అడ్డుకోబోయిన ముగ్గురు అటవీ అధికారులకు గాయాలు

పులుల సంరక్షణపై తీవ్ర ఆందోళన, ఈ ఏడాది ఇది మూడో ఘటన

**మహా :** అసోంలోని గోలాఘాట్ జిల్లాలో అత్యంత దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. ఒక వ్యక్తి మృతికి ప్రతీకారంగా వెయ్యి మందికి పైగా గ్రామస్థులు ఏకమై ఒక రాయల్ బెంగాల్ పులిని అత్యంత కిరాతకంగా హతమార్చారు. ఆవేశంతో ఊగిపోయిన జనం, పెద్ద పులిని చంపడమే కాకుండా దాని శరీర భాగాలను కోసుకుని తీసుకెళ్లడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఏడాది అసోంలో పులుల మృతికి సంబంధించిన ఘటనలు వెలుగు చూడటం ఇది మూడోసారి కావడంతో వన్యప్రాణి సంరక్షణపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే, గోలాఘాట్ జిల్లాలోని దుసుతిముఖ్ గ్రామానికి చెందిన వెయ్యి మందికి పైగా ప్రజలు గురువారం ఈ దారుణానికి ఒడిగట్టారు. సుమారు నెల రోజుల క్రితం సమీప గ్రామంలో ఒక వ్యక్తి పులి దాడిలో మరణించాడని, ఆ పులే తమ పశువులైన పందులు, మేకలను కూడా చంపుతోందని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో ఆగ్రహంతో రగిలిపోయిన గ్రామస్థులు, పదునైన ఆయుధాలు, ఇనుప రాడ్లు, కత్తులతో గురువారం ఉదయం సుమారు 6 గంటలకు పులి కోసం వేట ప్రారంభించారు. ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య, కజిరంగా నేషనల్ పార్క్ మరియు టైగర్ రిజర్వ్ కు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక అటవీ ప్రాంతంలోకి పులిని తరిమి, దానిపై దాడి చేసి చంపేశారు. సమాచారం అందుకున్న అటవీ, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే గ్రామస్థులు పులిని చుట్టుముట్టి హతమార్చారు. పులి కాళ్లు, చెవులు, చర్మం, దంతాలు, గోళ్లు వంటి శరీర భాగాలను విజయానికి గుర్తుగా కోసుకుని తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు.

ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన ముగ్గురు అటవీ శాఖ సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోలాఘాట్ డీఎఫ్ఓ గుణదీప్ దాస్ తెలిపారు. పులి కళేబరానికి వైద్య పరీక్షలు నిర్వహించగా, తుపాకీ కాల్పుల వల్ల కాకుండా పదునైన ఆయుధాలతో దాడి చేయడం వల్లే అది మృతి చెందినట్లు తేలిందని ఆయన వివరించారు. పోస్టుమార్టం అనంతరం పులి అవశేషాలను గోలాఘాట్ రేంజ్ కార్యాలయంలో దహనం చేశారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే మృణాల్ సైకియా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఇది చాలా బాధాకరమైన సంఘటన. ఈ భూమి మనుషులకు మాత్రమే కాదు, జంతువులకు కూడా చెందింది. వన్యప్రాణులకు కూడా జీవించడానికి స్థలం అవసరం" అని ఆయన అన్నారు. మే మొదటి వారం నుంచే ఈ పులి దుసుతిముఖ్ గ్రామ పరిసరాల్లో తిరుగుతున్న విషయం స్థానికులకు తెలుసునని పర్యావరణ కార్యకర్త అపూర్బ బల్లవ్ గోస్వామి తెలిపారు. "మే 4న ఒక స్థానికుడు పులి సంచారం గురించి మాకు సమాచారం ఇచ్చారు, దాని ప్రకారం అటవీ శాఖకు తెలియజేశాం. అటవీ దళాలను మోహరించి, సరైన అప్రమత్తతతో ఉంటే ఈ దారుణ ఘటనను నివారించగలిగేవారు" అని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామస్థులు ముందుగానే పులిని వేటాడేందుకు ఆయుధాలు సిద్ధం చేసుకున్నారని అటవీ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది అసోంలో పులుల మరణాలు ఆందోళనకరంగా పెరిగాయి. ఇంతకుముందు ఓరంగ్ నేషనల్ పార్క్‌లో ఒకటి, బిశ్వనాథ్ వన్యప్రాణి విభాగంలో మరొక పులి కళేబరాలు లభ్యమయ్యాయి. తాజా ఘటనతో పులుల సంరక్షణ చర్యలపై నీలినీడలు కమ్ముకున్నాయి. చనిపోయిన పులి ఎక్కడి నుంచి వచ్చిందో ఇంకా గుర్తించలేదని కేఎన్‌పీటీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ సోనాలి ఘోష్ తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది.

# ఆనంద్ మహీంద్రాకు సింగర్ ట్వీట్





ఇండియన్ మార్కెట్లో మహీంద్రా అండ్ మహీంద్రా వాహనాలకు మంచి డిమాండ్ ఉంది. సేఫ్టీ, దృఢమైన నిర్మాణం వంటి కారణాల వల్ల ఎక్కువ మంది ఈ బ్రాండ్ కార్లను ఇష్టపడుతుంటారు. కానీ.. పంజాబీ సింగర్ అండ్ యాక్టర్ 'గిప్పీ గ్రెవాల్' (Gippy Grewal) మాత్రం భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ.. ఆనంద్ మహీంద్రాకు ట్వీట్ చేశారు. నిరాశ కలిగించే ఎక్స్‌పీరియన్స్ అంటూ.. ''దయచేసి సాయం చేయండి అని మహీంద్రా రైస్, ఆనంద్ మహీంద్రాలను ఉద్దేశించి ట్వీట్ చేశారు. నా టీమ్ కోసం రెండు స్కార్పియో ఎన్ కార్లను కొనుగోలు చేసాను. అయితే వాటిలో ఎప్పుడూ టెక్నికల్ ప్రాబ్లమ్స్ తలెత్తుతూనే ఉన్నాయి. డీలర్‌షిప్ సిబ్బంది కూడా సరైన పరిష్కారం చూపించడం లేదు'' అని రెండు స్క్రీన్‌షాట్‌లను షేర్ చేశారు.

నేను ఇండియన్ బ్రాండ్‌కు పెద్ద అభిమానిని. ఈ కారణం చేతనే రెండు 'స్కార్పియో ఎన్' కార్లను కొనుగోలు చేసాను. కార్లలో సమస్యలు తలెత్తినప్పుడు.. సర్వీస్ సెంటర్‌కు తీసుకెళ్తే, సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు. సర్వీస్ సెంటర్‌కు వాహనాలు ఎన్నిసార్లు వచ్చాయో చూపించడానికి డీలర్‌షిప్ తమ వాహనాల ఎంట్రీ & ఎగ్జిట్ లాగ్‌ల కాపీని ఇవ్వడానికి కూడా నిరాకరించిందని సింగర్ పేర్కొన్నారు.

మొదటి వాహనంలో.. ఎల్ఈడీ డీఆర్ఎల్, ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ సరిగ్గా పనిచేయడం లేదు. ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్ బ్లింక్ అవుతుంది, తరచుగా ఫోన్ నుంచి డిస్‌కనెక్ట్ అవుతుంది. డీలర్‌షిప్ ఈ సమస్యను పరిష్కరించలేకపోయింది. రెండవ వాహనం కూడా ఇలాంటి సమస్యలే.. బూట్ స్పేస్ కూడా సమస్య కూడా ఉంది. ఇది తయారీ లోపం కావచ్చని గిప్పీ గ్రేవాల్ మెయిల్‌లో పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆనంద్ మహీంద్రా దీనిపై స్పందించలేదు. తప్పకుండా తగిన పరిష్కారం చూపించే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

# జొమాటో కొత్త ఛార్జీలు: దూరాన్ని బట్టి బాదుడే..

ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్.. జొమాటో కొత్త ఫీజును వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. నష్టాలను తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 4 కి.మీ కంటే ఎక్కువ దూరం డెలివరీ చేసే ఫుడ్ ఆర్డర్‌ల కోసం ''లాంగ్ డిస్టెన్స్ సర్వీస్ ఫీజు'' పేరుతో అదనపు ఛార్జీలను వసూలు చేయనుంది. 150 రూపాయల కంటే ఎక్కువ విలువైన ఫుడ్ ఆర్డర్ చేసినప్పుడు.. బుక్ చేసుకునే హోటల్/రెస్టారెంట్ దూరం 4 నుంచి 6 కి.మీ మధ్య ఉంటే రూ. 15 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువ దూరం ఉంటే.. దూరాన్ని బట్టి అదనపు ఛార్జీ (రూ. 25, రూ. 35) మారుతుంది. ఈ ఛార్జీ మీరు ఎంత ధరకు ఫుడ్ బుక్ చేసుకున్నారు అనేదాని మీద ఆధారపడి ఉండదు. కోవిడ్19 కి ముందు, జొమాటో 45 కి.మీ పరిధిలో ఉచిత డెలివరీని అనుమతించింది. మహమ్మారి తర్వాత, చాలా రెస్టారెంట్లు క్లోజ్ అయ్యాయి. దీంతో ఆ పరిమితిని 15 కి.మీ.లకు పొడిగించారు. తరువాత డెలివరీ ఫీజు వసూలు చేయడం మొదలు పెట్టింది. ఇప్పుడు దూరాన్ని బట్టి అదనపు ఫీజును వసూలు చేయాలని నిర్ణయించింది. జొమాటో తీసుకున్న ఈ నిర్ణయం.. కస్టమర్లపై తీవ్రమైన ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది. ఛార్జీలను ఎప్పటికప్పుడు పెంచుతూ పోతుంటే.. ఫుడ్ కోసం ఖర్చు చేసే డబ్బుకంటే డెలివరీ కోసం చేసే ఖర్చు ఎక్కువవుతుందని కొందరు భావిస్తున్నారు. మొత్తం మీద జొమాటో నిర్ణయం వల్ల.. సంస్థ ఎలాంటి ఫలితాన్ని పొందుతుందో తెలుసుకోవడానికి ఇంకా కొన్ని రోజులు వేచి చూడాల్సి ఉంటుంది.



## రూ.94 లక్షలు దాటేసిన బిట్‌కాయిన్: తొలిసారి..



బంగారం, వెండి ధరలు మాత్రమే కాకుండా.. బిట్‌కాయిన్ విలువ కూడా అమాంతం పెరుగుతూనే ఉంది. మొదటిసారి బిట్‌కాయిన్ విలువ 1,12,000 డాలర్లకు (రూ. 94 లక్షల కంటే ఎక్కువ) చేరింది. ఓవైపు మదుపర్ల నుంచి గిరాకీ.. మరోవైపు అమెరికా అధ్యక్షుడు తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా దీని విలువ భారీగా పెరుగుతోంది. బ్లూమ్‌బెర్గ్ డేటా ప్రకారం.. గురువారం ప్రారంభ ఆసియా ట్రేడింగ్‌లో బిట్‌కాయిన్ 3.3 శాతం పెరిగి 1,11,878 డాలర్లను దాటేసింది. రెండవ స్థానంలో ఉన్న ఈథర్ విలువ కూడా 7.3 శాతం పెరిగింది. అమెరికా సెనేట్‌లో స్టేబుల్‌కాయిన్ బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత బిట్‌కాయిన్ విలువ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రిప్టోకు అనుకూలంగా ఉన్నారని తెలుస్తోంది. ఈ కారణంగానే బిట్‌కాయిన్ వాల్యూ ఆల్ టైమ్ గరిష్టాలకు నెమ్మదిగా కదులుతోందని.. ఫాల్కన్‌ఎక్స్ లిమిటెడ్‌లోని గ్లోబల్ కోహెడ్ ఆఫ్ మార్కెట్స్ జాషువా లిమ్ పేర్కొన్నారు. మైఖేల్ సాయిలర్ అనుబంధ సంస్థ ఇప్పటికే.. 50 బిలియన్ డాలర్ల (రూ. 4 లక్షల కోట్ల కంటే ఎక్కువ) విలువైన బిట్‌కాయిన్‌లను కొనుగోలు చేసింది. అంతే కాకుండా.. కన్వర్టిబుల్ బాండ్స్, ప్రిఫర్డ్ స్టాక్స్ వంటి అనేక కొత్త టెక్ కంపెనీలు కూడా వివిధ మార్గాల్లో బిట్‌కాయిన్‌లను కొనుగోలు చేస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే.. రాబోయే రోజుల్లో బిట్‌కాయిన్ విలువ మరింత భారీగా పెరుగుతుందని స్పష్టంగా అర్థమవుతోంది.

## యాపిల్‌కు ట్రంప్ వార్నింగ్..
### భారత్‌లో ఐఫోన్ తయారు చేస్తే..



**వాషింగ్టన్:** భారత్‌లోనే కాకుండా ప్రపంచ దేశాల్లో ఎక్కడెక్కడో తయారు చేసిన ఐఫోన్లను అమెరికాలో అమ్ముతామంటే ఉపేక్షించబోనని ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ కంపెనీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా మినహాయించి ఇతర దేశాల్లో తయారు చేసిన ఐఫోన్‌లను దేశీయంగా అమ్మితే 25 శాతం టారిఫ్ విధిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌గా ఓ వేదికగా ఓ పోస్టును షేర్ చేశారు. అందులో 'నేను చాలా కాలం క్రితమే నేను ఈ విషయాన్ని యాపిల్ సీఈవో టిమ్‌కుక్ చెప్పాను. అమెరికాలో అమ్మే ఐఫోన్లను అమెరికాలోనే తయారు చేయాలని, విదేశాల్లో కాదని. భారత్‌తో పాటు మరో ఇతర దేశంలోనైనా తయారు చేసిన ఐఫోన్లను ఇక్కడ అమ్మితే వాటిపై యాపిల్ కంపెనీ అమెరికాకు కనీసం 25 శాతం టారిఫ్ చెల్లించాల్సిందే'అని పేర్కొన్నారు. అయితే, ట్రంప్ విధించే టారిఫ్‌లు యాపిల్ ఒక్క కంపెనీకే పరిమితం అవుతుందా? లేదంటే అన్నీ కంపెనీలపై సుంకం విధిస్తారా? అన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. మరోవైపు ట్రంప్ వ్యాఖ్యలపై యాపిల్ అధికారికంగా స్పందించాల్సి ఉంది. మరోవైపు, అమెరికా ,చైనా సుంకాల యుద్ధంతో అవరోధాలు తలెత్తుతున్న నేపథ్యంలో యాపిల్ కంపెనీ ఐఫోన్ తయారీకి భారత్ ప్రత్యాహ్నాయంగా భావిస్తోంది. ఇందులో భాగంగా భారత్‌లో భారీ ఎత్తున తయారీ రంగంలో పెట్టుపెట్టేందుకు సిద్ధమైంది. కాగా, యాపిల్ నివేదిక ప్రకారం.. జూన్ త్రైమాసికంలో అమెరికాలో అమ్మే ఫోన్లలో ఎక్కువ శాతం భారత్‌లో తయారు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది.




# దేశం-విదేశం
NATIONAL-INTERNATIONAL



# కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఎదురుగాలి
## పుంజుకుంటున్న బీజేపీ

సీఎం సిద్దరామయ్యకు తరగని ఆధరణ
బీజేపీకి ఆధరణ పెరిగినా నాయకత్వ లేమీతో ఇబ్బందులు
ఉనికి కోల్పోతున్న జేడీ (ఎస్).. పల్స్ ఆఫ్ కర్నాటక స్టేట్ సర్వేలో వెల్లడి
పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ, కొడెమో టెక్నాలజీస్ సంయుక్త సర్వే

**మహా :** కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ, కొడెమో టెక్నాలజీస్ సంయుక్తంగా నిర్వహించిన ''పల్స్ ఆఫ్ ది కర్ణాటక స్టేట్'' సర్వేలో సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ప్రజావ్యతిరేకత కనిపిస్తుండగా, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీజేపీకి ప్రజాదరణ పెరుగుతోందని వెల్లడైంది. తొలి 24 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆదరణ తగ్గుతున్న దశలో రానున్న 36 నెలలు కాలం కాంగ్రెస్ ప్రభుత్వానికి మరింత కీలకం కానున్నది. సాధారణంగా ఏ ప్రభుత్వానికైనా మొదటి దశలో ఉన్న ఆదరణ రెండో దశలో తగ్గుతుంటుంది. మొదటి రెండు సంవత్సరాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆదరణ కోల్పోతూ ఉంటే రానున్న 3 సంవత్సరాల కాలంలో తమ ప్రతిష్టను ఏ విధంగా కాపాడుకుంటుందో అన్నది వేచి చూడాలి. కర్ణాటకలో ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఆదరణ తగ్గిపోయిందని పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ నిర్వహించిన ''పల్స్ ఆఫ్ ది కర్ణాటక స్టేట్'' సర్వేలో వెల్లడైంది. కర్ణాటకలో 1985 నుండి ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా తదుపరి ఎన్నికల్లో సొంతంగా సంపూర్ణ మెజార్టీ సాధించలేదనే అంశం ఇక్కడ గమనించాల్సిన విషయం. ఇదే ట్రెండ్ ఈ సారి కూడా కొనసాగే అవకాశాలున్నట్లు స్పష్టమౌతోంది. పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ, కొడెమో టెక్నాలజీస్ కలిసి రాష్ట్ర వ్యాప్తంగా 10,481 శాంపిల్స్‌తో 17 ఏప్రిల్ నుండి 18 మే వరకు, నెల రోజుల పాటు ''పల్స్ ఆఫ్ ది కర్ణాటక స్టేట్'' ట్రాకర్ పోల్ నిర్వహించింది. కర్ణాటకలో 224 అసెంబ్లీ స్థానాలుండగా, మెజార్టీకి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 113. పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం ఈ రోజు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే ప్రస్తుత ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీజేపీ



51 శాతం ఓట్లతో 136 159 స్థానాలు, కాంగ్రెస్ 40.3 శాతం ఓట్లతో 62 82 స్థానాలు, జేడీ(ఎస్) 5 శాతం ఓట్లతో 3 6 స్థానాలు గెలుచుకునే అవకాశాలున్నాయని వెల్లడైంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పై ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీజేపీ 10.7 ఓట్ల శాతం స్పష్టమైన ఆధిక్యత కనబరుస్తోంది. పహల్గాం ఘటన అనంతరం ఆపరేషన్ సిందూర్ కూడా బీజేపీకి అనుకూలంగా మారాయి. పాకిస్తాన్ తో కాల్పుల విరమణ తర్వాత, అంటే మే 10వ తేదీ తర్వాత బీజేపీకి 1 1.5 శాతం ఓటర్ల మద్దతు పెరిగినట్టు సర్వేలో స్పష్టమైంది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 42.88 శాతం ఓట్లతో 135 స్థానాలు, బీజేపీ 36 శాతం ఓట్లతో 66 స్థానాలు, జేడీ(ఎస్) 13.29 శాతం ఓట్లతో 19 స్థానాలు గెలుపొందగా, ఈ రెండేళ్ల వ్యవధిలో అధికార కాంగ్రెస్ పార్టీ తీవ్ర ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్నట్టు ఈ సర్వేలో వెల్లడైంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల తరువాత కర్ణాటకలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రశ్నించినప్పుడు 55 శాతం మంది బీజేపీ, 39.1 శాతం మంది కాంగ్రెస్ అని, 3.6 శాతం మంది జెడి (ఎస్) అని, 2.3 శాతం మంది ఇతరులు అని పీపుల్స్ పల్స్ కొడెమో సంస్థలు నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. మహిళా ఓటర్లలో బీజేపీకి 48.4 శాతం, కాంగ్రెస్‌కు 44.6 శాతం మద్దతు లభిస్తుండడంతో కాంగ్రెస్ పై బీజేపీ మహిళా ఓటర్లలో 3.8 శాతం ఆధిపత్యం కనబరుస్తోంది. సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా మహిళా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా ఆశించిన ఆదరణ పాలకపక్షానికి లభించడం లేదు. పురుష ఓటర్లలో బీజేపీ 51.9 శాతం, కాంగ్రెస్ 38.9 శాతం ఓట్లు సాధిస్తుండడంతో, బీజేపీ కాంగ్రెస్ పై 13 శాతం భారీ ఆధిక్యత చూపుతున్నట్టు సర్వేలో వెల్లడైంది. 18 25 సంవత్సరాల ఓటర్లలో బీజేపీ 24 శాతం ఆధిక్యతను కాంగ్రెస్ పార్టీపై కొనసాగిస్తోంది. ఇతర వయసు ఓటర్లలో బీజేపీకి 48 శాతం నుండి 51 శాతం ఓట్లు లభిస్తుండగా, కాంగ్రెస్ కు 42 శాతం నుండి 44 శాతం ఓట్లు లభించవచ్చని పీపుల్స్ పల్స్ సర్వే సంకేతాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కూడా బీజేపీ స్పష్టమైన ఆధిక్యతలో ఉంది. గ్రామీణ ప్రాంతంలో 13.5 శాతం, పట్టణాల్లో 6.6 శాతం కాంగ్రెస్ పార్టీపై బీజేపీ ఆధిక్యతలో ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో జేడీ (ఎస్) 5.7 శాతం ఓట్లు సాధించవచ్చని సర్వేలో వెల్లడైంది. రైతుల్లో బీజేపీకి 53.9 శాతం, కాంగ్రెస్ కు 37.4 శాతం ఓట్లు లభించవచ్చు. 2023 ఎన్నికల్లో రైతు సంబంధిత అంశాలను కీలకంగా ప్రచారం చేసి, సానుకూల ఫలితాలు సాధించిన కాంగ్రెస్ కు ప్రస్తుతం రైతుల్లో కూడా ఆదరణ తగ్గడం గమనించాల్సిన విషయం. కర్ణాటకలో మత, కుల రాజకీయాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. హిందూ సామాజికవర్గంలో బీజేపీకి 58.5 శాతం ఆదరణ లభిస్తుండగా, కాంగ్రెస్ కు లభిస్తున్న ఆదరణ కేవలం 32 శాతానికే పరిమితమైంది. ముస్లిం సామాజికవర్గంలో 85.5 శాతం ఓట్లతో కాంగ్రెస్ పటిష్టంగా ఉండగా, బీజేపీ కేవలం 9.3 శాతం ఓట్లే పొందే అవకాశం ఉన్నట్లు ఈ సర్వేలో తేలింది. రాష్ట్రంలోని జనరల్ కేటగిరీ ఓటర్లలో 15.1 శాతం, ఓబీసీల్లో 14 శాతం, ఎస్టీల్లో 22 శాతం ఆధిక్యత బీజేపీ కనబరుస్తోంది. రాష్ట్రంలో కీలకమైన లింగాయత్ సామాజికవర్గంలో బీజేపీకి 78.9 శాతం ఆదరణ లభిస్తుండగా, కాంగ్రెస్ కు కురుబా సామాజికవర్గంలో 54.6 శాతం ఆదరణ కనిపిస్తోంది. మరోవైపు ఒక్కలింగాస్ సామాజికవర్గంలో బీజేపీకి 47.8 శాతం, జేడీ(ఎస్)కు 24.6 శాతం, కాంగ్రెస్ కు 22.9 శాతం ఆదరణ ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. సామాజికవర్గాల వారీగా పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ కురుబ, ఆది కర్ణాటక, మాదిగ, మాదర్ సామాజికవర్గాల్లో బీజేపీపై ఆధిక్యత కనబరుస్తుండగా, లింగాయత్ (వీరశైవాస్), ఒక్కలింగాస్ నాయక్/నాయక్ వాల్మీకి, మరాఠాస్, విశ్వకర్మ సామాజికవర్గాల్లో బీజేపీ ముందంజలో ఉన్నట్లు ఈ సర్వేలో వెల్లడైంది.

# మా నీళ్లు ఆపితే మీ ఊపిరి ఆపుతాం

- భారత్‌ను హెచ్చరించిన పాక్ సైనిక ప్రతినిధి
- సింధూ జలాలపై భారత్‌కు పాక్ ఆర్మీ తీవ్ర హెచ్చరిక
- ఉగ్రవాది హఫీజ్ సయీద్ వ్యాఖ్యలను పునరుద్ఘాటించిన పాక్ సైనిక ప్రతినిధి



**మహా :** సింధూ నదీ జలాల ఒప్పందం విషయంలో భారత్‌కు పాకిస్థాన్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రవాది హఫీజ్ సయీద్ గతంలో ఉపయోగించిన పదజాలాన్నే ఆయన పునరుద్ఘాటించడం గమనార్హం. ఉగ్రవాదాన్ని ఆపేంత వరకు సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ తీసుకున్న నిర్ణయంపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో జరిగిన సభలో మాట్లాడుతూ, "మీరు మా నీటిని అడ్డుకుంటే, మేము మీ ఊపిరిని అడ్డుకుంటాం" అని చౌదరి భారత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు సమాచారం. 2008 ముంబై దాడుల సూత్రధారి, లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్ కూడా గతంలో ఇదే తరహా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన అనంతరం, ఏప్రిల్ 23న భారత్ సింధు జలాల ఒప్పందంలోని కొన్ని భాగాలను నిలిపివేసింది. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం, సింధు నది మరియు దాని ఉపనదుల నీటి పంపకాలకు సంబంధించినది. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ గురువారం స్పందించింది. ఉగ్రవాదం, చర్చలు ఒకేసారి సాగవని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించుకున్న భారత భూభాగాలను ఖాళీ చేయడంపై మాత్రమే భవిష్యత్తులో చర్చలు ఉంటాయని ఆయన తేల్చిచెప్పారు. పాకిస్థాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం విశ్వసనీయంగా, శాశ్వతంగా ఆపేంత వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని జైస్వాల్ పునరుద్ఘాటించారు. "నీరు, రక్తం కలిసి ప్రవహించవు" అన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. అంతకుముందు, రాజస్థాన్‌లోని బికనీర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, ఉగ్రవాదానికి మద్దతు కొనసాగిస్తే పాకిస్థాన్ "ప్రతి పైసా కోసం కష్టపడాల్సి వస్తుందని" హెచ్చరించారు. "భారతీయుల రక్తంతో ఆడుకోవడం ఇప్పుడు పాకిస్థాన్‌కు చాలా ఖరీదైన వ్యవహారంగా మారుతుంది" అని మోదీ ఘాటుగా వ్యాఖ్యానించారు.

# పాకిస్థాన్‌కు గూఢచర్యం



**మహా :** పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నారన్న ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. ఢిల్లీ, వారణాసి ప్రాంతాల్లో వేర్వేరు ఆపరేషన్లు నిర్వహించి వీరిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. నిందితుల నుంచి కీలక సమాచారం రాబట్టేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

**నోయిడాలో హరూన్ అరెస్ట్, పాక్ దౌత్యవేత్తతో సంబంధాలు**

ఉత్తర ప్రదేశ్ ఏటీఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఢిల్లీలో తుక్కు వ్యాపారం చేసే మొహద్ హరూన్‌ను నోయిడాలో అదుపులోకి తీసుకున్నారు. ఇతనికి పాకిస్థాన్ దౌత్య కార్యాలయానికి చెందిన ముజమ్మల్ హుస్సేన్‌తో సన్నిహిత సంబంధాలున్నట్లు ఏటీఎస్ గుర్తించింది. హరూన్ కు పాకిస్థాన్‌లో బంధువులు ఉండటంతో, ముజమ్మల్ వీసాలు ఇప్పించడంలో సాయపడినట్లు గుర్తించారు. ఇదే అదనుగా హరూన్, పలువురికి పాక్ వీసాలు ఇప్పిస్తానని నమ్మించి వారి నుంచి డబ్బులు వసూలు చేసి, వివిధ బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఏటీఎస్ గుర్తించింది. ఈ సొమ్ములో కొంత కమీషన్‌గా తీసుకుని, మిగిలిన మొత్తాన్ని ముజమ్మల్ చెప్పిన వ్యక్తులకు హరూన్ అందజేసేవాడని గుర్తించారు. పాక్ దౌత్య కార్యాలయ సిబ్బందితో హరూన్‌కు నిత్యం సంబంధాలు ఉండటంతో, ఇతని ద్వారా సున్నితమైన సమాచారం పాకిస్థాన్‌కు చేరి ఉండవచ్చని ఏటీఎస్ అనుమానిస్తోంది. కాగా, ముజమ్మల్ హుస్సేన్‌ను ఇప్పటికే అనుమానిత వ్యక్తిగా ప్రకటించిన భారత ప్రభుత్వం, అతడిని స్వదేశానికి తిప్పి పంపిన విషయం తెలిసిందే.

**వారణాసిలో తుఫైల్ అరెస్ట్, దేశ వ్యతిరేక కార్యకలాపాలు**

మరోవైపు, ఆదంపుర్, వారణాసిల్లో యూపీ ఏటీఎస్ బృందం నిర్వహించిన ఆపరేషన్‌లో తుఫైల్ అనే మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇతను పాకిస్థానీ సంస్థలు నిర్వహిస్తున్న దేశ వ్యతిరేక వాట్సాప్ గ్రూపుల్లో చురుగ్గా పాల్గొంటున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేసినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయని ఏటీఎస్ పేర్కొంది. ఏటీఎస్ వెల్లడించిన వివరాల ప్రకారం, "తుఫైల్ పాకిస్థాన్‌లోని వ్యక్తులు, సంస్థలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తున్నాడు. పాకిస్థాన్‌లో నిషేధానికి గురైన తెహ్రీక్ ఎ లబ్బేక్ సంస్థ వ్యవస్థాపకుడు మౌలానా షాద్ రిజ్వీకి చెందిన వీడియోలను తరచూ ఇతరులకు పంపిస్తున్నాడు. అలాగే, 'గజ్వా ఎ హింద్'కు సంబంధించిన విషయాలను ప్రచారం చేస్తూ, భారత్‌లో షరియా చట్టం తీసుకురావాలనే భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నాడు" అని తెలిపారు. వారణాసిలోని రాజ్‌ఘాట్, నమోఘాట్, జ్ఞానవాపి మసీదు, వారణాసి రైల్వే స్టేషన్, జామా మసీదు వంటి కీలక ప్రదేశాలతో పాటు ఢిల్లీలోని ఎర్రకోట, నిజాముద్దీన్ దర్గా ఫోటోలను పాకిస్థాన్‌లోని వ్యక్తులకు తుఫైల్ పంపినట్లు గుర్తించారు. ఇతనికి పాకిస్థాన్‌కు చెందిన సుమారు 600 మందితో సంబంధాలున్నాయని, ఫైసలాబాద్‌కు చెందిన నఫీస అనే మహిళతో కూడా తుఫైల్ సంప్రదింపులు జరుపుతున్నాడని, ఆమె భర్త పాకిస్థాన్ సైన్యంలో పనిచేస్తున్నాడని ఏటీఎస్ అధికారులు తెలిపారు. ఈ రెండు కేసులపై వేర్వేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన యూపీ ఏటీఎస్, దర్యాప్తును మరింత లోతుగా చేపట్టింది.





# మెగా 157 ప్రారంభం.. ఫస్ట్ సీన్ ఎక్కడంటే

మెగాస్టార్ చిరంజీవి,అనిల్ రావిపూడి తాజా చిత్రం 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) ఈరోజు హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభమైంది. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ మూవీని నిర్మించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నయనతార నటిస్తున్న సంగతి తెలిసిందే. వరుస విజయాలు అందించిన అనిల్ రావిపూడికి ఇది చిరంజీవితో తొలి చిత్రం కావడం విశేషం. చిరంజీవి అభిమానులు ఎప్పటి నుంచో ఆయనను మళ్లీ పూర్తి స్థాయి హ్యూమరస్ క్యారెక్టర్ లో చూడాలనుకుంటున్నారు. ఇప్పుడు సరిగ్గా అలాంటి కాన్సెప్ట్‌తోనే ఈ చిత్రం రానుంది. తన అభిమాన హీరో మెగాస్టార్ చిరంజీవిని డైరెక్ట్ చేయాలన్న అనిల్ రావిపూడి నిరీక్షణకు తెరపడింది. ఈ రోజు (మే 23) హైదరాబాద్‌లో సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. మొదటి రోజు డైరెక్టర్ అనిల్ రావిపూడి, చిరంజీవితో పాటు ఇతర నటీనటులపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ ప్రాజెక్ట్‌పై అనిల్‌తో పాటు చిరంజీవి కూడా ఎంతో ఆసక్తిగా ఉన్నారు. తాజాగా "సంక్రాంతికి వస్తున్నాం" సినిమాతో ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ అందుకుని మంచి జోరు మీదున్న అనిల్ రావిపూడి, తన యూనిక్ ప్రమోషన్లతో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. టెక్నికల్ క్రూ పరిచయ వీడియో, తర్వాత నయనతార ప్రోమో వీడియో ఆడియన్స్ ని కట్టిపడేసింది.ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. రైటర్స్ ఎస్ కృష్ణ, జి ఆది నారాయణ స్క్రిప్ట్‌పై వర్క్ చేస్తున్నారు, ఎస్ కృష్ణ కూడా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా ఉన్నారు.

# అల్లు అర్జున్ మనసులో రాఘవేంద్రరావు స్థానం..

ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ తన తొలి చిత్ర దర్శకుడు కె. రాఘవేంద్రరావు గారిపట్ల ఎంతో గౌరవం, కృతజ్ఞతతో ఉంటాడు. తనను హీరోగా తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేసిన దర్శకేంద్రుడు రాఘవేంద్రరావును నిత్యం తలచుకునేలా, తన సినీ ప్రయాణం ప్రారంభమైన దశను ప్రతిరోజూ గుర్తు చేసుకునేలా, అల్లు అర్జున్ తన కార్యాలయ ప్రవేశద్వారంలో రాఘవేంద్రరావు ఫోటోను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆయన వ్యక్తిగతంగానే కాకుండా వృత్తిపరంగా దర్శకుడిపై తన గౌరవాన్ని చాటుకున్నారు. అల్లు అర్జున్ కెరీర్ విజయాలమీద మాత్రమే కాకుండా, తనకు మద్దతుగా నిలిచిన వారిపట్ల ఎల్లప్పుడూ కృతజ్ఞత భావాన్ని వ్యక్తపరిచే విషయంలో కూడా ఎంతో విలువలతో ఉంటాడు. ఈ విషయంలో ఆయన వ్యక్తిత్వం కూడా ఎంతో ప్రత్యేకమైనది. రాఘవేంద్రరావు తనను సినిమారంగంలోకి పరిచయం చేసిన తొలి దర్శకుడిగా, ఆయన జీవితంలో ప్రత్యేక స్థానం సంపాదించారు. "అల్లు అర్జున్ తన కెరీర్ ఎదుగుదలకు తోడ్పడిన దర్శకుల విషయంలో ఎంతో జెన్యూన్ ప్రేమతో ఉంటాడు. వాళ్ల పట్ల ఎప్పుడూ ఆయన మనసులో ఎంతో గౌరవం ఉంటుంది. అందులో రాఘవేంద్రరావుకు బన్నీ జీవితంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. తన దర్శకులు, సాంకేతిక నిపుణులు, చిత్ర బృందంలోని ఇతర సభ్యుల పట్ల అల్లు అర్జున్ గల గాఢమైన భావోద్వేగ బంధం గురించి ఆయన తరచూ మాట్లాడుతుంటారు. సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన తొలిదశలో ఆయనకు సహాయపడిన వారిని ఆయన ఎప్పటికీ మరిచిపోరు అని పలువురు అంటున్నారు. అల్లు అర్జున్ కార్యాలయం ప్రవేశద్వారంలో ఉన్న రాఘవేంద్రరావు చిత్రపటం ఆయనలో ఉన్న కృతజ్ఞత, గౌరవం, భావోద్వేగ సమన్వయానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ విలువలే ఆయన విజయాలకు పునాది మాత్రమే కాకుండా, స్టార్‌గా కాకుండా వ్యక్తిగా కూడా ఆయనను ప్రత్యేకంగా నిలిపాయి అని సినీ పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# విక్రమ్ సరసన క్రేజీ ఛాన్స్..

చిత్రపరిశ్రమలో వైవిధ్య భరిత కథాచిత్రాలకు కేరాఫ్ చియాన్ విక్రమ్. ఈయన తాను నటించే ప్రతి చిత్రంలోనూ కొత్తగా కనిపించడానికి ప్రయత్నిస్తుంటారు. అలా ఇటీవల తంగలాన్, వీర ధీర సూరన్ చిత్రాల్లో నటించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. కాగా తాజాగా విక్రమ్ తన 63వ చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి మడోనా అశ్విన్ కథ, దర్శకత్వం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతకుముందు మండేలా, మావీరన్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలకు దర్శకత్వం వహించారన్నది గమనార్హం. కాగా ఈ క్రేజీ చిత్రాన్ని శాంతి పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సంస్థ ఇంతకుముందు శివకార్తికేయన్ కథానాయకుడిగా మావీరన్ వంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిందన్నది గమనార్హం. కాగా తాజాగా విక్రమ్ హీరోగా నిర్మించే చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయితే ఇందులో విక్రమ్ సరసన నటించే హీరోయిన్ ఎవరన్నది ఆసక్తిగా మారింది. ఇప్పటికే నటి ప్రియాంక మోహన్, అలాగే శ్రీనిధిశెట్టిలలో ఒకరు నటింపజేసే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. కాగా తాజాగా లక్కీ కథానాయకి మీనాక్షి చౌదరిని నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ కన్నడ బ్యూటీ ఇటీవల తెలుగు, తమిళ భాషల్లో మంచి రేసింగ్‌లో ఉన్నారు. ఈమె ఇంతకు ముందు తమిళ్, తెలుగు భాషల్లో దుల్కర్ సల్మాన్‌కు జంటగా నటించిన లక్కీ భాస్కర్ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. అలాగే వెంకటేష్ సరసన నటించిన తెలుగు చిత్రం సంక్రాంతికి వస్తున్నాం కూడా సూపర్ హిట్ అయింది. దీంతో ప్రస్తుతం ఈమె క్రేజీ కథానాయకిగా వెలుగొందుతున్నారు. కాగా మరోసారి తమిళంలో విక్రమ్‌తో జత కట్టడానికి రెడీ అవుతారా? అన్నది వేచి చూడాలి.



## క్రీడా వార్తలు SPORTS NEWS

# ఆర్సీబీకి షాకిచ్చిన సన్‌రైజర్స్


## టాప్-2 కష్టమే ఇక..!



ఐపీఎల్ 2025లో టాప్2పై కన్నేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు సన్ రైజర్స్ హైదరాబాద్ షాక్ ఇచ్చింది. శుక్రవారం లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో సన్ రైజర్స్. 42 పరుగుల తేడాతో ఆర్సీబీని చిత్తు చేసింది. దీంతో ఈ టోర్నీలో ఐదో విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు ఈ మ్యాచ్‌లో ఓటమితో ఆర్సీబీ.. పాయింట్స్ టేబుల్‌లో 2వ స్థానం నుంచ మూడో ప్లేసుకు పడిపోయింది. ఐపీఎల్ 2025లో ఇప్పటికే ప్లే ఆఫ్ రేసు నుంచి నిష్క్రమించిన సన్ రైజర్స్ హైదరాబాద్ వెళ్తూ వెళ్తూ మిగతా జట్లపై ప్రభావం చూపిస్తోంది. గత మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ను ఓడించి ఆ జట్టును ప్లే ఆఫ్స్‌కు దూరం చేసింది. తాజాగా పాయింట్స్ టేబుల్‌లో టాప్‌లోకి దూసుకెళ్లాలన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆశలపై నీళ్లు చల్లింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన సన్ రైజర్స్ 42 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో ఐదో విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ..సన్ రైజర్స్‌కు ఫస్టు బ్యాటింగ్ అప్పగించింది. ఇషాన్ కిషన్ (48 బంతుల్లో 94 రన్స్ నాటౌట్) చెలరేగడంతో సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు స్కోరు చేసింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లలో రొమారియో షెఫర్డ్ 2 వికెట్లు తీశాడు. భువనేశ్వర్ కుమార్, లుంగీ ఎంగిడి, సుయాశ్ శర్మ, కృనాల్ పాండ్యా ఒక్కో వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ..ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది. విరాట్ కోహ్లీ (25 బంతుల్లో 43 రన్స్), ఫిలిప్ సాల్ట్ (32 బంతుల్లో 62 రన్స్) రాణించడంతో ఆర్సీబీ లక్ష్యం దిశగా సాగింది. పది ఓవర్లు ముగిసే సరికి 118/1తో నిలిచింది. 9 వికెట్లు చేతిలో ఉన్న ఆర్సీబీ.. మిగిలిన 10 ఓవర్లలో 114 రన్స్ చేస్తే విజయం దక్కేదే. కానీ ఇన్నింగ్స్ సెకండాఫ్‌లో సన్ రైజర్స్ బౌలర్లు బలంగా పుంజుకున్నారు. జితేశ్ శర్మ (15 బంతుల్లో 24 రన్స్), రజత్ పాటీదార్ (16 బంతుల్లో 18 రన్స్) క్రీజులో ఉండటంతో ఆర్సీబీ 15.3 ఓవర్లలో 173/3తో నిలిచింది. చివరి 27 బంతుల్లో విజయానికి 59 రన్స్ అవసరం. కానీ ఈ స్థితి నుంచి ఆర్సీబీ అనూహ్యంగా కుప్పకూలింది. ఆ తర్వాత 16 పరుగుల వ్యవధిలోనే చివరి ఏడు వికెట్లు కోల్పోయింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న రొమారియో షెఫర్డ్ (0), టిమ్ డేవిడ్ (1) నిరాశపరిచారు. దీంతో 19.5 ఓవర్లలో ఆర్సీబీ.. 189 పరుగులకు ఆలౌట్ అయింది. 42 పరుగుల తేడాతో ఓడింది. పాయింట్స్ టేబుల్‌లో 2వ ప్లేసు నుంచి మూడో స్థానానికి పడిపోయింది.

## యువ షూటర్ అద్రియాన్‌కు కాంస్యం..

# టాప్‌లోనే భారత్



ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ల (Indian Shooters) పతకాల పంట పండిస్తున్నారు. శుక్రవారం యువ షూటర్ అద్రియాన్ కర్మాకర్(Adriyan Karmakar) కాంస్యంతో గర్జించాడు. 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్స్‌లోకి కంచు మోత మోగించి రెండో మెడల్ ఖాతాలో వేసుకున్నాడు. తొలిసారి వరల్డ్ కప్‌లో పోటీ పడుతున్న ఈ కుర్ర షూటర్ గురువారం 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో రజత పతకం గెలుపొందిన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో అద్రియాన్ అదరగొట్టాడు. 41వ షాట్‌లో 10.8, 42వ షాట్‌లో 10.6 మీటర్లతో మూడో స్థానంలో నిలిచాడు. అద్రియాన్ కాంస్యంతో భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానం నిలబెట్టుకుంది. మహిళల త్రీపిస్టల్ విభాగంలో 17 ఏళ్ల అనౌష్క తోకుర్ (Anoushka Thokur) 7వ స్థానంతో సరిపెట్టుకుంది.



# హైదరాబాద్‌లో జాతీయ రోయింగ్ టోర్నీ


**హైదరాబాద్ :** హైదరాబాద్ వేదికగా ఈనెల 27 నుంచి జాతీయ సబ్‌జూనియర్ రోయింగ్ చాంపియన్‌షిప్ జరుగనుంది. హుస్సేన్‌సాగర్ 26వ జాతీయ సబ్‌జూనియర్ రోయింగ్ టోర్నీకి ఆతిథ్యమివ్వనుంది. ఇందులో 23 రాష్ట్రాల నుంచి దాదాపు 350 మంది ప్లేయర్లు పోటీపడబోతున్నారు. అండర్13, 15 వయసు విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఎల్బీ స్టేడియంలో సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ఆవిష్కరించారు.

# డబ్ల్యూటీసీ ఫైనల్‌లో భారత్ ప్రాతినిధ్యం



**దుబాయ్ :** వచ్చే నెల 11 నుంచి ప్రఖ్యాత లార్డ్స్ వేదికగా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జరుగబోయే ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ కోసం మ్యాచ్ నిర్వాహకులను ఐసీసీ ప్రకటించింది. ఈ మెగా బ్లాకబస్టర్ పోరుకు టీమ్‌ఇండియా అర్హత సాధించలేకపోయినా భారత్ నుంచి ఇద్దరు వ్యక్తులు ఫైనల్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మ్యాచ్‌కు రిఫరీగా భారత మాజీ పేసర్ జవగళ్ శ్రీనాథ్ వ్యవహరించనుండగా నితిన్ మీనన్ ఫోర్త్ అంపైర్ బాధ్యతలను నిర్వర్తించనున్నాడు. రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ (ఇంగ్లండ్), క్రిస్ జాఫనే (న్యూజిలాండ్) ఆన్ ఫీల్డ్ అంపైర్లుగా ఉండనున్నారు. శ్రీనాథ్, నితిన్‌తో పాటు భారత్ నుంచి ప్రముఖ కామెంటేటర్ రవిశాస్త్రి.. ఈ మ్యాచ్‌కు కామెంటరీ ప్యానెల్‌లో ఉన్న విషయం విదితమే.

# నేటి నుంచి ప్లేఆఫ్స్ టికెట్ల విక్రయం



**ముంబై :** ఐపీఎల్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌ల టికెట్ల విక్రయం శనివారం నుంచి ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని బీసీసీఐ శుక్రవారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. జొమాటోకు చెందిన డిస్ట్రిక్ యాప్ ద్వారా టికెట్లు అందుబాటులోకి ఉంటాయని తెలిపింది. రూపే కార్డు దారులకు 24 గంటల ప్రత్యేక విండో ద్వారా టికెట్లు కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. ఈనెల 27తో లీగ్ దశ ముగిసి 29వ తేదీ నుంచి ప్లేఆఫ్స్ మొదలుకానున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com